
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం, 11 సెప్టెంబరు 2024



వరద బాధితుల ఖాతాల్లోకి నగదు

- తొలిరోజు 4450 మందికి బదిలీ
- ఒక్కొక్కరికి రూ. 16,500 చొప్పున సాయం

ఖమ్మం,సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): మున్నేరు ముంపు బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వరదసహాయం మంగళవారం నుంచి వారి ఖాతాల్లోకి జమచేయడం ప్రారంభించారు. ప్రభుత్వం ముందుగా రూ. 10వేలు మాత్రమే సహాయం ప్రకటించగా.. అవి సరిపోవని భావించి రూ. 16,500 అందించాలని నిర్ణయించారు. నగదును రెవెన్యూ అధికారుల ద్వారా నేరుగా ముంపు బాధితుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. కాగా మున్నేరు వరదకు సంబంధించి మొత్తం 11,413 మందిని బాధితులుగా గుర్తించగా.. తొలిరోజు 4450 మంది ఖాతాలకు నగదును బదిలీ చేశారు. అందులో ఖమ్మం అర్బన్ పరిధిలో 8678 మంది ఉండగా, 3550 మంది ఖాతాలకు నగదును బదిలీ చేశారు. ఖమ్మం రూరల్ పరిధిలో 2813 ఖాతాలకు గాను 900 మంది ఖాతాలకు నగదు బదిలీ పూర్తయింది. ఖమ్మం అర్బన్ పరిధిలో 78 మందికి ఖాతాలు లేకపోవడంతో వారికి నేరుగా చెక్కులు ఇచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. బ్యాంకర్లు తమకు బ్యాంకుల ఖాతాల వారీగా లిస్టు ఇవ్వాలని అడగడంతో ప్రక్రియ స్వల్పంగా ఆలస్యమవుతున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

పెరిగిన నష్టం అంచనాలు

- మొత్తం 729.68 కోట్లు నష్టం జరిగినట్టు నివేదికలు
- నేడు, రేపు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులివ్వాలి...

- వరద సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం సమర్ధవంతంగా పనిచేసింది...
- మున్నేరు వరద వల్ల 15 వేల ఇండ్లు దెబ్బతిన్నాయి
- బాధిత కుటుంబాలకు రూ.16,500 సాయం
- 80వేల ఎకరాల్లో పంటల నష్టం
- బాధిత రైతులకు రూ.10వేల చొప్పున పరిహారం
- నేడు కేంద్ర బృందానికి పూర్తిస్థాయి నివేదిక ఇస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో మున్నేరు పరీవాహక ప్రాంతంతో పాటు జిల్లాలోని ఇతర మండలాల్లో వందేళ్ల చరిత్రలో లేని విధంగా కురిసిన భారీవర్షాల వల్ల జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్రం సాయం అందించాలని, ఇందుకోసం జిల్లాలో పర్యటించే కేంద్ర బృందానికి పూర్తిస్థాయిలో నివేదికలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వరద సహాయ కార్యక్రమాల్లో జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని అభినందించారు. ఖమ్మం జిల్లాలో కేంద్ర బృందం బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో మంత్రి తుమ్మల వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

శాఖల వారీగా వరదనష్టంతోపాటు పంటల నష్టం నివేదికలను సమీక్షించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

జిల్లాలో వరదల కారణంగా ఆరుగురు మృతిచెందారని తెలిపారు. ఆకస్మికంగా వచ్చిన వరదల కారణంగా జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమించి పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి యుద్ధప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు నిర్వహించిందని, ప్రజల ప్రాణాలు కాపాడడంతో పాటు పునరావాస కేంద్రాల్లో భోజనం ఇతర వసతులు సమకూర్చారని అభినందించారు. వరద తగ్గిన 24 గంటల్లోనే వరద బాధితులకు నిత్యావసరాలు, భోజనాలు బట్టలు, మూడురోజులపాటు అందించడంతో ఖమ్మం వెంటనే కోలుకోగలిగిందన్నారు. ఇతర జిల్లాల నుంచి పారిశుధ్య కార్మికులను కూడా రప్పించడం జరిగిందని, వరదల వల్ల 15096 ఇళ్లు దెబ్బతిన్నాయని, 150 ఇళ్లు పడిపోయామని మంత్రి వివరించారు. వరద బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున నేరుగా అకౌంట్లకే జమచేస్తున్నామని తెలిపారు.

జిల్లాలో పంటల నష్టం కూడా అధికంగా జరిగిందని, సుమారు 80వేల ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రతి రైతుకు ఎకరానికి రూ.10వేల చొప్పున బ్యాంకుఅకౌంట్లకు జమచేయడం జరుగుతుందని రూ.63కోట్లు కావాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపిందన్నారు. అలాగే మిర్చి, పండ్లతోటలకు మరో రూ.68కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారని, రైతులదరికి పరిహారం అందిస్తామన్నారు.

జిల్లాలో ఆర్అండ్‌బీకీ రూ.151 కోట్ల మేర నష్టం జరిగిందని, తక్షణ మరమ్మతులకు రూ.6కోట్లు నిధులు అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ రోడ్లకు రూ.34కోట్లమేర నష్టం జరిగిందని రూ.2కోట్లు తక్షణ మరమ్మతులకు అవసరం ఉందని తెలిపారు. ఇరిగేషన్ శాఖకు పెద్దఎత్తున నష్టం జరిగిందని, ఎన్ఎస్‌పీ కాలవలకు పలుచోట్ల గండ్లుపడడం, తెగిపోవడం సుమారు రూ.434కోట్లు ఇరిగేషన్‌కు నష్టం జరిగిందన్నారు. కేంద్ర బృందం జిల్లాలో పర్యటన సందర్భంగా జరిగిన నష్టాన్ని పూర్తిగా వివరించడం జరుగుతుందని, అన్ని నివేదికలను అందిస్తామని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా వరదలో దెబ్బతిన్న వారికి, రైతులకు తగిన సహాయం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 16వ ఆర్థికసంఘం కమిటీ సమావేశంలో కూడా రాష్ట్రంలో జరిగిన వరదల నష్టంపై నివేదిక ఇవ్వడం జరిగిందని తెలిపారు. కేంద్ర బృందానికి నివేదిక ఇచ్చి రాష్ట్రానికి జరిగిన నష్టంపై ఎక్కువ పరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మేయర్ పునుకొల్లు నీరజ కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. రైతన్న



రాళ్లు రప్పలతో మేటవేసిన సాగుభూమిని చూపుతున్న రైతు

మళ్లీ సాగు చేసేది ఎట్లా!?

- వర్షాలు, వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న పంట పొలాలు
- ఇసుక మేటలు, రాళ్ల కుప్పలతో పనికిరాకుండా మారిన వైనం
- పెట్టుబడులు.. పంటలు పోయి కుంగిపోతున్న అన్నదాతలు
- ప్రభుత్వ పరిహారం సరిపోదని వేడుకోలు
- 80 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని అంచనా
- 53 వేల మంది రైతులు.. రూ.200కోట్లపైగా నష్టం

ఖమ్మం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడ్డాయి... వాతావరణం అనుకూలించింది.. సాగర్ కూడా నిండింది. పంటలకు డోకా లేదని కొండంత ఆశతో వానాకాలం సాగు చేస్తున్న రైతులకు... భారీవర్షాలు మున్నేరు, పాలేరు, ఆకేరు వరదలు కోలుకోలేని దెబ్బతీశాయి. పచ్చని పంటపొలాల్లో ఇసుకమేటలు, కొట్టుకువచ్చిన రాళ్లను పొలాలను చూసి కన్నీరుమున్నీరు అవుతున్నారు. మళ్లీ పంట సాగుచేసేదెట్లా అన్న మాట ప్రతి రైతునోటా వినిపిస్తున్నది.

ఖమ్మం మున్నేరు పరీవాహకంలో భారీ వర్షాలతో అన్నివాగులు, ఏర్లు చెరువులు పరవళ్లు తొక్కి ప్రవహించాయి. పచ్చని పంట పొలాలను సర్వనాశనం చేశాయి. గోదావరి వరదల కంటే కూడా మున్నేరు వరద బీభత్సంతో రైతులు కోలుకోలేని విధంగా కుంగిపోయారు. ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30వేల పైన నష్టపోయాం, పొలాలు మళ్లీ బాగు చేయాలంటే పెద్ద ఎత్తు డబ్బు ఖర్చవుతుంది. మళ్లీ సాగుచేయాలంటే సాధ్యమవుతుందా అన్న ఆవేదన, ఆందోళన రైతుల నుంచి వినిపిస్తున్నది.

జిల్లాలో మున్నేరు, పాలేరు, ఆకేరు నదులు పొంగి ప్రవహించిన వరదలతోపాటు భారీవర్షాల నీటితో అనేక వాగులు చెరువులకు వరద నీరు వచ్చిపడడంతో వ్యవసాయ పంటలకు కూడా భారీనష్టం జరిగింది. జిల్లాలో పత్తి, వరి, మిర్చి, పెసర, మొక్కజొన్న, కూరగాయలతో పాటు పలురకాల పంటలకు సంబంధించి 53,528 మంది రైతులకు చెందిన 79,914 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, తద్వారా రూ.111.87కోట్ల వరకు నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా (మిగతా 6వ పేజీలో)



భద్రాచలం వద్ద పరవళ్లు తొక్కుతూ 48 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

ఉగ్ర గోదావరి

- భద్రాద్రి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- రాత్రి 11 గంటలకు 49.8 అడుగుల నీటిమట్టం
- తుది హెచ్చరికకు చేరువయ్యే అవకాశం
- నీట మునిగిన కల్యాణ కల్యాణ కట్ట
- 36 గంటల్లో 23.3 అడుగుల నీటిమట్టం పెరుగుదల
- సమీక్షించిన కలెక్టర్, పీవో, ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలం, సెప్టెంబరు 10: భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగులు దాటి ఉధృతంగా ప్రవహిస్తోంది. మంగళవారం అర్ధరాత్రికి మూడో ప్రమాద హెచ్చరికకు చేరువగా వచ్చే అవకాశం ఉన్నట్లు కేంద్ర జల సంఘం అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు 34.1 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం మంగళవారం ఉదయం 6 గంటలకు 38.9 అడుగులు, 7.32 గంటలకు తొలి ప్రమాద హెచ్చరిక 43 అడుగులకు చేరుకోవడంతో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. 9 గంటలకు 44.3 అడుగులకు చేరుకున్న గోదావరి.. 12 గంటలకు 46.1 అడుగులకు, 3 గంటలకు 47.5, 5.51 గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఆర్డీవో జారీ చేశారు. కాగా రాత్రి 11 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 49.8 అడుగుల మేర ఉంది.

నీట మునిగిన కల్యాణకట్ట కింది భాగం

గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండటంతో గోదావరి నదీ తీరాన ఉన్న భద్రాద్రి దేవస్థానం కల్యాణకట్ట కిందిభాగం నీట మునిగింది. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. కరకట్టపై నుంచి గోదావరిని తిలకించేందుకు భద్రాద్రివాసులు, పర్యాటకులు రావద్దని పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ క్రమంలో బారికేడ్లను, ఫెన్సింగ్‌లను ఏర్పాటు చేశారు.

36 గంటల్లో 23.3 అడుగుల నీటిమట్టం పెరుగుదల

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం 6 గంటలకు 25.3 అడుగుల మేర ఉంది. అప్పటి వరకు తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో ఒక్కసారిగా పెరిగింది. దీంతో మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48.6 అడుగులకు చేరుకోవడం గమనార్హం. అంటే గత 36 గంటల్లో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 23.3 అడుగుల మేర పెరిగింది.

పరిస్థితిని సమీక్షించిన కలెక్టర్, పీవో, ఎమ్మెల్యే తెల్లం

గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక దాటి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు వరద పరిస్థితిపై సమీక్షించారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరికకు చేరువగా రానుండటంతో నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను, అధికారులను అప్రమత్తం చేశారు.ఇదే సమయంలో అత్యవసర పరిస్థితుల్లో భద్రాచలం, కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములను సంప్రదించాలని సూచించారు. ప్రజలు నీటి ప్రవాహం ఉన్నచోటకు వెళ్లవద్దని సూచించారు.

ఆరు దశాబ్దాల్లో సెప్టెంబరు నెలలో 13 సార్లు

భద్రాచలంలో గోదావరి సెప్టెంబరు నెలలో తొలి ప్రమాద హెచ్చరికను దాటడం గత ఆరు దశాబ్దాల్లో 13 సార్లు జరిగింది. 1966 సెప్టెంబరు 7న 65.9 రాగా ఇదే సెప్టెంబరు నెలలో ఇప్పటి వరకు అత్యధికం. ఇందులో చివరి ప్రమాద హెచ్చరిక 53 అడుగులు ఏడుసార్లు దాటడటం గమనించదగ్గ విషయం.

శవమై కనిపించిన కానిస్టేబుల్



భద్రాచలం, సెప్టెంబరు 10: కొత్తగూడెం క్లూస్ టీమ్‌కు చెందిన కానిస్టేబుల్ శీలం రమణారెడ్డి మృతదేహం సోమవారం అర్ధరాత్రి ఏపీలోని అల్లూరి జిల్లా నెల్లిపాక వద్ద గోదావరిలో లభ్యమైంది. మానసిక కుంగుబాటుతో ఈ నెల 6వ తేదీన భద్రాచలంలోని గోదావరి వారధిపై నుంచి రమణారెడ్డి దూకి గల్లంతైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన ఆచూకీ కోసం భద్రాచలం పోలీసులు, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, సోమవారం అర్ధరాత్రి నెల్లిపాక వద్ద రమణారెడ్డి శవంగా కనిపించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన సాయి ఎక్కడ?

- భార్య మమత రోదన
- ఐదు రోజుల క్రితం కిన్నెరసాని ప్రవాహంలో గల్లంతు
- రెండు రోజులు గాలించి చేతులెత్తేసిన అధికారులు

7



ఎమ్మెల్యే ‘తెల్లం’ భవితవ్యం !?

- అనర్హత వివాదంలో భద్రాచలం ఎమ్మెల్యే
- పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై హైకోర్టు ఆదేశాలతో ఉత్కంఠ

6



సుందరీకరణం’

‘గోళ్లపాడు’ మాయం ఘొల్లుమన్న నగరం



గోళ్లపాడు చానల్‌పైన పార్క్ ఏర్పాటు చేసిన దృశ్యం

- కోట్ల రూపాయలు ఖర్చు చేసి.. ఖమ్మం కొంపముంచారు
- కాలువను పూడ్చి పైపులైన్ల ఏర్పాటు
- ప్రవాహానికి సరిపడా దారి లేక వెనక్కి ఎగదన్నిన వరద నీరు
- ఖమ్మం కాలనీలు జలమయం కావడానికి ఈ మార్పే కారణం
- మురుగు నీరు ప్రవాహం అవసరాల కోసం పైపులైన్ల ఏర్పాటు
- 20 మీటర్ల కాల్వను 1200ఎంఎం పైపులైనుగా మార్పు
- ఆనాడు వర్షపునీరు గురించి ఆలోచన చేయలేదని విమర్శలు
- పలు కాలనీల నీటిమునకతో గోళ్లపాడు ఛానల్‌పై చర్చ

ఖమ్మం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర సుందరీకరణ 'పైన పటారం లోన లొటారం'లా మారింది. ఎక్కడ చూసినా పార్కులు, పచ్చని చెట్లు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లతో ఆహ్లాదకరంగా కనిపించిన నగరం... గత వారం కురిసిన వర్షాలతో డొల్లగా మారింది. గతంలో ఎంతటిస్థాయిలో వర్షాలు పడినా ఆగని వరద నీరు.. ఈ సారి నగరాన్ని ముంచేసింది. పదుల కొద్దీ కాలనీలు జలమయం అయ్యాయి. ఈ మునకకు కారణమేంటన్న అంశాలపై చర్చలు మొదలయ్యాయి. వాటిల్లో గోళ్లపాడు ఛానల్ ఆధునీకరణే ప్రధానంగా కనిపిస్తోంది. మురికికూపంలా ఉన్న గోళ్లపాడును రూ. 100 కోట్లు ఖర్చు చేసి ఆధునీకరించిన విషయం పక్కనపెడితే, అధికారులు చేసిన తప్పిదాలు ప్రస్తుతం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల కొంప ముంచాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మురుగునీటి ప్రవాహంపై అధికదృష్టి

రూ. 100 కోట్లు ప్రాజెక్టు ఖర్చు, రూ. 200 కోట్లు స్థల సేకరణ, 10.6 కిలోమీటర్ల ఆధునీకరణ, పది పార్కులు నిర్మాణం.. అండర్ గ్రౌండ్ సీవరేజ్ పైపులైను నిర్మాణం చేసి ఖమ్మం నగరంలోని గోళ్లపాడు ఛానల్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. అందుకోసం గోళ్లపాడు కాల్వ పక్కన ఉన్న 862 గృహాలను అక్కడి నుంచి తరలించారు. అయితే ఛానల్ ఆధునీకరణ పనులు చేసిన సందర్భంలో అధికారులు అవగాహన రాహిత్యంతో పనిచేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తును పక్కన పెట్టి కేవలం నివాసాల నుంచి వచ్చే మురుగు నీరుపైనే అత్యధికంగా దృష్టిసారించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నివాసాల్లో వాడుకున్న నీళ్లు ఏ స్థాయిలో వస్తాయో అంచనావేసి మాత్రమే సుందరీకరణ కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుందరీకరణ పూర్తయిన సందర్భంలో ఉన్నతాధికారులు సైతం డ్రైనేజీ నీళ్లు, వర్షపు నీరు వెళ్లేందుకు తుఫాను నీటి కాల్వను అండర్ గ్రౌండ్‌గా మార్చినట్టుగా పేర్కొన్నారు. అయితే తుఫాను నీటి కాల్వ సక్రమంగా ఉండి ఉంటే గత వారం కురిసిన వర్షాలకు వరద నీరు ఎందుకు నిలిచేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జూబ్లీపుర, సారధినగర్, వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, కాల్వొడ్డు, రంగనాయకులగుట్ట, ప్రకాష్‌నగర్, శ్రీనివాసనగర్ వంటి పదుల కాలనీల నుంచి వచ్చే వరద నీరు, ఇళ్లల్లో వాడుకున్న నీళ్లు రెండు ఒకేసారి కాల్వలోకి చేరిన క్రమంలో పొంగిపొర్లడంతో కాలనీలు మునకకు గురయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

20 మీటర్ల కాల్వ 1200 ఎంఎం పైపులైనుగా..

గోళ్లపాడు ఛానల్ 20 మీటర్ల వెడల్పుతో ఉంది. అయితే అంతటి వెడల్పు ఉన్న కాల్వను అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ గా మార్చి కేవలం 800 నుంచి 1200 ఎంఎం ఉన్న పైపులైనుకు అనుసంధానం చేశారు. ఈ కారణంగానే సులువుగా వెళ్లాల్సిన నీళ్లు ఆయా పైపులు గుండా వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడినట్టుగా ప్రచారం జరుగుతోంది. 10.60 కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీగా మార్చిన అధికారులు 6.5 కిలోమీటర్ల మేర డ్రెయిన్‌లు నిర్మించారు. అది కూడా ఎంతో వెడల్పు లేదన్న వాదన వినిపిస్తోంది. పబ్లిక్ యుటిలైజేషన్ పేరుతో పెద్ద కాల్వను అండర్ గ్రౌండ్ డ్రైయినేజీగా మార్చి పైన పార్కులు ఏర్పాటు చేసిన కారణంగానే నీళ్లు వెళ్లేందుకు అడ్డంకులు తప్పడంలేదన్న అభిప్రాయాలు లేకపోలేదు. అంతపెద్ద ఎత్తున ఖర్చుపెట్టి సమస్యలను మరింత జటిలం చేశారన్న వాదన వినిపిస్తోంది. అండర్ డ్రైనేజీ చేయకుండా కాల్వను ఉన్నంత వెడెల్పుతోనే ఆధునీకరించి ఉంటే ఎంతటిస్థాయిలో తుఫానులు వచ్చినా ఆ వరద నీరు వెళ్లేందుకు ఇబ్బంది ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అలా చేయని కారణంగానే ప్రస్తుతం ఆయా కాలనీల నుంచి వరద నీరు వెళ్లలేక నీళ్లతో నిండిపోయినట్టుగా ప్రచారం జరుగుతోంది. ఇకమీదట అయినా అమాత్యులు దీనిపై పునపరిశీలన చేసి వరద నీటికోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.



ఒకప్పటి గోళ్లపాడు చానల్ అసలు రూపం

ముంపులో సగం పాత్ర

ఇటీవల కురిసిన వర్షాలకు 14 డివిజన్లు పూర్తిగా మునిగిపోగా.. వాటిల్లో చాలా ప్రాంతాలు గోళ్లపాడు ఛానల్‌కు లింకు అయినవే ఉండటం గమనార్హం. గత వారం వర్షాలు కురిసిన సమయంలో మున్నేరు ముంచెత్తగా నదీతీరం వెంబడి ఉన్న పలు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. వాటితోపాటుగా వాటికి సమీపంలో ఉన్న ప్రాంతాల్లో సైతం పెద్ద ఎత్తున నీళ్లు నిలిచాయి. అయితే ఆయా ప్రాంతాల్లో నీరు బయటకు వెళ్లేందుకు గోళ్లపాడు ఛానల్ కూడా ఓ మార్గంగా ఉంది. మునిగిన ప్రాంతాల్లో జూబ్లీపుర, సారధినగర్, వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, కాల్వొడ్డు, రంగనాయకులగుట్ట, ప్రకాష్‌నగర్, శ్రీనివాసనగర్, సుందరయ్య నగర్, రావిచెట్టు ప్రాంతం, పోలీస్ లైన్, ఓల్డ్ పంపింగ్‌వెల్ రోడ్డు, పాత ఎఫ్‌సీఐ గోదాం వంటి ప్రాంతాల్లో నీరు కూడా గోళ్లపాడు ఛానల్ ద్వారా వెళ్లాల్సినవే. కానీ గతవారం ఒకవైపు మున్నేరు పెరిగి ఆయా కాలనీల్లోకి నీళ్లు రావడం, మరోవైపు ఆ నీరు వెళ్లేందుకు సులువుగా గోళ్లపాడు ఛానల్ లేనికారణంగానే కాలనీలు మునిగాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



క్షౌరశాలలో నివాసం ఉంటున్న దృశ్యం

నిల్వ నీడలేక ముంపు వాసుల
దీనావస్థలు

- క్షౌరశాలలో ఓ కుటుంబం
- కోలుకోలేని 64 కుటుంబాలు

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 10: మూడు వైపుల వాగులు చుట్టుముట్టి ఇళ్లను ముంచెత్తాయి. 64 కుటుంబాలకు చెందిన వారికి నిల్వ నీడ లేకుండ పోయింది. ఇప్పుడు ఆ గ్రామంలోని ముంపు వాసుల పరిస్థితి అగమ్య గోచరంగం మారింది. పాల్వంచ మండలంలోని ఉల్వనూరు గ్రామం వరద ముంపుకు పూర్తిగా దెబ్బతిన్నది. లోతట్టు గృహాల్లో నివసిస్తున్న వారు ప్రస్తుతం నిలువ నీడలేని పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో 54గృహాలు నీటికి దెబ్బతిన్నాయి. ముంపు తర్వాత ఇళ్లలో ఉండలేక అధికారులు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో రెండురోజులు తల దాచుకున్నారు. అనంతరం ఆ ఇళ్లలో నివాసం ఉండలేక ఆరుబయట సామాగ్రి పెట్టుకుని ఉంటున్నారు. ఇళ్ల పై కప్పులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోగా గోడలు కూలడంతో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన రాజు కుటుంబం తాను చేసే వృత్తి క్షౌరదుకాణంలోనే నివాసం ఉంటున్నారు. వలగాలి పద్మ, పోచంపల్లి సత్యనారాయణరెడ్డి వీరితో పాటు మరి కొంతమంది ఉండేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు పునరావాసాలను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. కిన్నెరసాని గ్రామంలో వాగు ప్రవాహానికి పది గృహాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొత్తం 64గృహాలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు వేశారు.



ఇంటి సామగ్రితో ఆరుబయటనే

ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలి

- ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం, సెప్టెంబరు 10: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నిరుద్యోగ గిరిజన యువత, రైతులు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించి పదిమందికి మార్గదర్శకులుగా నిలవాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మండలంలోని ఎంఎస్ఎంఈ యూనిట్ చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణలో ఉన్న వాటిని పరిశీలించారు. దుమ్ముగూడెం మండలంలో రూ.40లక్షల సమ్మక్క-సారక్క చిల్లీ యూనిట్, రూ.25 లక్షల దుర్గాభవాని సెంట్రింగ్ యూనిట్, రూ.12లక్షల సీతారామ కాంక్రీట్ మిషన్ యూనిట్, రూ.10.33లక్షల డెయిరీ యూనిట్ ఏర్పాట్లను పరిశీలించారు. 60శాతం సబ్సిడీ, 10శాతం కాంట్రిబ్యూషన్, బ్యాంకు రుణాలతో యూనిట్లు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. ఆర్లగూడెంలో డ్రాగన్ పళ్ల తోటను రైతు ద్విచక్రవాహనంపై వెళ్లి పరిశీలించారు. చిననల్లబల్లి అంగన్వాడీ కేంద్రం, ఆర్లగూడెం జీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచి పోషకాహారం అందించాలని, వారికి అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. రూ.40 లక్షల లక్ష్మీనగరం పల్లి చిక్కి యూనిట్‌ను సందర్శించి, పరిశ్రమ ఆగడానికి గల కారణాలను యూనిట్ సభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఏపీఎం హేమంతిని, జేడీఎం హరికృష్ణ, డీఈ హరీష్, ఏఈ వెంకటేశ్వర్లు, రాంకుమార్ పాల్గొన్నారు.



విద్యార్థిని ప్రశ్నిస్తున్న పీవో



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి

కార్యకర్తలకు సేవ చేసేందుకే బీజేపీ

- ఖైరతాబాదు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు10: కార్యకర్తలకు అండగా ఉండడంలో బీజేపీ ముందుంటుందని దేశ అభివృద్ధి చూసి బీజేపీలో చేరేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాదు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఓహోటల్‌లో నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవిడ్ సమయంలో 42కోట్ల మందిని బీజేపీ ఆదుకుందని, అదే మాదిరిగా ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రజలను సైతం బీజేపీ ఆదుకుంటుందన్నారు. ముంపు ప్రాంతాల్లో సేవ చేసే విషయంలో బీజేపీ కార్యకర్తలు ముందుటుందన్నారని, బీజేపీ ప్రజా సేవకసోమే పుట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని పైకి ఒకరిపై ఒకర విమర్శలు చేసకోవడం హాస్యాస్పదమన్నారు. జిల్లాలో ప్రతి పోలింగ్ బూత్‌లో 200 పైగా సభ్యత్వం తగ్గకుండా చేయాలని అన్నారు. అనంతరం నగరంలోని ముంపు ప్రాంతాలైన ధంసలాపురం కాలనీ(బ్రాహ్మణబజార్)లో పర్యటించి వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, రవికుమార్, అల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాస్, మంద సరస్వతి, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపునకు నిర్ణయం

- 2014 మ్యాపులో కాల్వ వెడల్పు పరిశీలన
- ఇప్పటికే ఆక్రమణదారుల్లో కొందరికి నోటీసులు

ఖమ్మం, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): గొలుసుకట్టు చెరువుల ద్వారా వెళ్లే వరద, మురుగునీరు వెళ్లే కాల్వపై ఆక్రమణలు పెరిగి కుంచించుకుపోవడంతో సదరు కాల్వకు సమీపంలోని కాలనీలన్నీ ముంపునకు గురయ్యాయి. రెండుసార్లు వర్షం వచ్చిన సమయాల్లోనూ పదుల కాలనీల్లో నడుముల్లోతు నీళ్లు నిలిచి స్థానికులు ఇళ్లల్లోనుంచి బయటకు రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో చైతన్యనగర్, కవిరాజ్‌నగర్ వాసులు వైరా రోడ్డులో ధర్నా నిర్వహించారు. దాంతో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆయా ప్రాంతాలను పరిశీలించి కాల్వ ఆక్రమణలకు గురైనట్లు గ్రహించారు. అందులో భాగంగా నీటిని నేరుగా వెళ్లేందుకు వీలుగా ఉండేలా వైరా రోడ్డుకు సమీపంలో కాల్వకు అడ్డుగా ఉన్న ఐస్‌ఫ్యాక్టరీని తొలగించారు. కాగా కాల్వకు చుట్టుపక్కల చేపట్టిన అక్రమ నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 2014 సంవత్సరంలో కాల్వ ఎంతటి వెడల్పు ఉందో పరిశీలేందుకు మ్యాపులు తెప్పించుకున్నారు. ఇప్పటికే కాల్వను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురికి నోటీసులు జారీ చేశారు. కాగా కాలనీల ముంపునకు గురవడానికి ఆక్రమణలే కారణమంటూ ఈ నెల మూడోతేదీన 'వరద నీరు వెళ్లేదారిలేకనే..' శీర్షికన, మ్యాపు లేదని ఎవరికి వారు తప్పించుకుంటున్న విషయాన్ని 'ఈ నగరానికి ఏమైంది' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే.

గణపయ్యలు ప్యాకింగ్

● పూజలందుకునేందుకు మరో ఏడాది

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 10: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని 2వేల గణపయ్యల ప్రతిమలు ప్యాకింగ్‌లోకి వెళ్లి కేఎంసీ కార్యాలయంలోకి చేరాయి. వినాయకచవితి సందర్భంగా పూజలందుకునేందుకు గణపయ్యలకు మరో ఏడాది రావాల్సి ఉంది. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'గణపయ్యకు వరద కష్టాలు' కథనంపై ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. పంపిణీకి నోచుకొని 2వేల గణపయ్యలను భద్రపరిచి వచ్చే ఏడాది భక్తులకు ఉచితంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు గణపయ్యలను ప్యాక్ చేసి కేఎంసీలో భద్రపర్చారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 10: భారీ వర్షాలు, వరదల దృష్ట్యా జిల్లాలో వచ్చే 15రోజుల్లో ప్రసవ (డెలివరీ) అంచనా తేదీలు ఉన్న గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వైద్యాధికారులకు ఆదేశించారు. వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది గర్భిణులను ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. వారి ఆరోగ్యవిషయమై సలహాలు, సూచనలు ఇస్తూ సాధారణ ప్రసవానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో వచ్చే 15రోజుల్లో 444 గర్భిణీల డెలివరీలు ఉన్నట్లు గుర్తించారని, వారి విషయమై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత వరద సమయంలోనే ఏడు ప్రసవాలు జరిగాయన్నారు. వారిని వైద్య, ఆరోగ్యసిబ్బంది 108,104 వాహనాల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి, ప్రసవాలు చేపట్టారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 896 వైద్యబృందాలతో 2లక్షల 96వేల 642 కుటుంబాలను సందర్శించి, 10లక్షల 45వేల 774మందికి ఆరోగ్య సర్వే చేశారన్నారు. అందులో 9299మందికి జ్వరం, 379మందికి డయేరియా ఉన్నవారికి చికిత్స అందించామన్నారు. 65,832మందికి మందులు అందించినట్లు, 510మందిని మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు కలెక్టర్ వివరించారు. భారీవర్షాలు, వరదల దృష్ట్యా ప్రత్యేక వైద్యశిబిరాలు, ప్రభావిత ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తూ, నిరంతరం అందుబాటులో ఉండి వైద్యసేవలు చేస్తున్న వైద్యాధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను అభినందించారు.

జిల్లాలో ప్రారంభమైన
విద్యాసంస్థలు

- పలు చోట్ల ఇంకా తొలగని బురద

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 10: భారీ వర్షాలతో వచ్చిన వరదల కారణంగా జిల్లాలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ముంజూరు చేసింది. కాగా మంగళవారం విద్యా సంస్థలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 1,268 పాఠశాలల్లో ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్ పాఠశాల, 20 జూనియర్ కళాశాలల్లో ఖమ్మం నగరంలోని నయాబజార్ కళాశాలలో తరగతులు నిర్వహించలేదు. బురద కారణంగా ఆవరణ అంతా శుభ్రం చేయ్యకపోవటంతోనే విద్యార్థులు హాజరు కాకపోవటంతో తరగతులు నిర్వహించలేదని విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు తెలిపారు. ఇంకా వారం రోజులు పడుతుందని తెలిపారు. కాగా మిగిలిన విద్యాసంస్థల్లో మంగళవారం విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరైనట్లు తెలిసింది. విద్యార్థులు హాజరు రిజిస్టర్, ఉపాధ్యాయుల రికార్డు రిజిస్టర్లు, కంప్యూటర్లు 69 ప్రభుత్వ పాఠశాలలు వరద నీటితో తడవగా వాటిని శుభ్రపరిచే పనిలో ఉపాధ్యాయులు ఉన్నారు. హాజరైన విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. జిల్లాలోని బోనకల్ మండలంలో 2 పాఠశాలలు, ఏన్కూరులో 9, కామేపల్లిలో 2, 8, ఖమ్మం అర్బన్‌లో 12, కొణిజర్లలో 3, కూసుమంచిలో 3, మధిరలో 4, నేలకొండపల్లిలో 6, పెనుబల్లిలో 3, రఘునాథపాలెంలో 4, సింగరేణిలో 5, సత్తుపల్లిలో 1, తిరుమలాయపాలెంలో 4, వేంసూర్‌లో 2, ఎర్రుపాలెంలో 2 పాఠశాలలు, మొత్తం 69 పాఠశాలలు వరద ముంపునకు గురికాగా వాటిల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి
దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, సెప్టెంబరు 10: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ మంగళవారం తెలిపారు. బోటనీ, కెమిస్ట్రీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, జువాలజీ, తెలుగులో నియమాకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 12వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 13న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు.

జాంబియాకు మిమిక్రీ రమేష్

కొత్తగూడెం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ మిమిక్రి కళాకారుడు, సీనియర్ జర్నలిస్ట్ మిమిక్రి రమేష్ ఈ నెల 12వ తేదీన జాంబియా రాజదాని లుకాకాకు వెళ్లనున్నారు. అక్కడి డ్రిల్లింగ్ కంపెనీస్ ఆధ్వర్యంలో నిర్వహించే గణేష్ ఉత్సవాలకు మిమిక్రి రమేష్‌కు ఆహ్వానం అందింది. 13, 14తేదీల్లో అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. అక్కడి జాంబియా క్యాపిల్ సిటీ లూసాకాలో అలీమార్ పార్క్, రోడ్స్ పార్క్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. 15వ తేదీన నిమజ్జనం కార్యక్రమం ఉంటుందని, ఆహ్వానించిన డ్రిల్లింగ్ కంపెనీల అధినేతలకు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

విపత్తును ఎదుర్కొవడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 10: భారీ వర్షాలతో ఏర్పాడిన విపత్తును ఎదుర్కొవటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, మొదటి రెండు రోజులు సరైన సహాయక చర్యలు అందటంలో జాప్యం జరిగిందని, భారీ వర్షాల సమయంలో హెలీకాప్టర్ వచ్చే ఉంటే రెండు ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. మంగళవారం రామనర్సయ్య భవన్‌లో జిల్లా కమిటీ సభ్యులు ఆవుల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పోటు రంగారావు మాట్లాడారు. మున్నేరు వరద ప్రభావానికి గురైన రెండు రోజులు అధికారయంత్రాంగం బాధితులకు అండగా నిల్వలేక పోయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు రూ.10వేలు, భారీ నష్టానికి రూ.16,500 ప్రకటించిందని అవి సరిపోవని ప్రతి బాధిత కుటుంబానికి రూ. 1 లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. శాస్త్రీయ విధానంలో పంట నష్టం అంచనాలను నమోదు చేయాలని అన్నారు. ఖమ్మంనగరంలో వ్యాపించిన బడా కార్పొరేట్ బంగారు, వస్త్ర, వ్యాపార సంస్థలు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావటం లేదని, వాటి లాభాల్లో 25శాతం బాధితులకు అందివ్వాలని డిమాండ్ చేశారు. మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ బృందం త్వరలో పర్యటిస్తొందన్నారు. ఈనెల 13నుంచి 18 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, గుర్రం అచ్చయ్య ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, రామయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సాగు చేసేది ఎట్లా!?

(5వ పేజీ తరువాయి)

వరి 30,460మంది 41,450, పత్తి 18,375మంది రైతులు 31,119 ఎకరాలు, పెసర 421 మంది రైతులు 1075 ఎకరాలు, మొక్కజొన్న 63మంది రైతులు 96 ఎకరాలు, మిర్చి 4017మంది రైతులు 5942 ఎకరాలు, కూరగాయలు 156 మంది రైతులు 132 ఎకరాలు ఆరటి13 మంది రైతులు 32 ఎకరాలు, బొప్పాయి 23మంది రైతులు 63 ఎకరాలు దెబ్బతిన్నాయి.

కూసుమంచి, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో పంటపొలాల్లో ఇసుకమేటలు కూడా వేశాయి ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు సహాయంప్రకటించింది. అయితే రైతులు ఎకరానికి ఇప్పటిక రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మిర్చి తోటలకు రూ.50వేలు పెట్టుబడులు పెట్టారు. పంటలపైపాట్లు తరుణంలో వచ్చి పడిన వరద వానాకలం పంటలను తీవ్రంగా నష్టం చేకూర్చింది.

ఎకరానికి రూ.25వేల వరకు రైతులకు నష్టం జరిగిన జిల్లాలో 79,980 ఎకరాలకు రూ.200కోట్లపైగా రైతుల పెట్టుబడే నష్టపోయారు. ప్రస్తుతం దెబ్బతిన్న పొలాలను శుభ్రంచేసుకుని మళ్లీ సాగుకు వెళ్లాలంటే రైతులకు దుక్కులు, ఇతర ఖర్చులు అదనపుబారం కానున్నాయి. ఇప్పటికే పొలం కౌళ్లు, దక్కులు, కూలీఖర్చులు విత్తనాలు ఇలా కనీసం రూ.25వేల నష్టపోయిన రైతు లు మళ్లీ సాగుకువెళ్లాలంటే మరో రూ.25వేలు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులు కనీసం ఎకరానికి రూ25వేలుపైన ఇవ్వాలని కోరుతున్నారు. పె ట్టిన పెట్టుబడి అయినా ఇస్తే కొంత కోలుకుంటామని సూచిస్తున్నారు. ఇక జిల్లాలో కోళ్లు, పశువులు, గొర్రెలు, మేకలు మొత్తం 52,648 చనిపోగా రూ. 116.35కోట్లు అంచనా వేశారు. అయితే వీటికి ప్రభ్తువం ఎంత మేర ఇస్తుందన్నది లెక్క తేలాల్సి ఉంది.



రాళ్లతో నిండిన పొలం

2 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది

షేక్ మదార్, తిమ్మినేనిపాలెం, చింతకాని మండలం

2 ఎకరాల వరి పొలంలో ఇసుక మేటలు వేసింది. ఈమేటలు తీసి మళ్లీ పొలం సాగుచేయాలంటే ఇప్పట్లో అవుతుందా అన్నది భయంగా ఉంది. పెట్టిన పెట్టుబడి నీటిపాలయింది. మాలాంటి చిన్నరైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

మాగాణి మొత్తం పోయింది

గుండ్ల సుధాకర్, చిన్నమండవ,చింతకాని మండలం

వరిపొలం 2 ఎకరాలు పూర్తిగా కొట్టుకుపోయింది. పంట ఆనవాళ్లే కనిపించడంలేదు. ఇసుక మేటలు వేశాయి. పొలం సారం అంతా దెబ్బతిన్నది. ప్రభుత్వం రూ.10వేలసాయం సరిపోదు. ఎకరానికి రూ.25వేలు ఇవ్వాలి. లేకుంటే కోలుకోలేం.

మిర్చి పంట వేసి నష్టపోయా

శంకర్, వాల్యాతండా, ఖమ్మంరూరల్



మూడు ఎకరాల మిర్చి తోట వేశా. ఎకరానికి రూ.60వేల వరకు పెట్టుబడి పెట్టా.నారుకే ఎకరానికి రూ.30వేలు ఖర్చుపెట్టా. నెలరోజులు మిర్చి పంటకు పైపాటు చేసి మందులు వేస్తున్న తరుణంలో వరద వచ్చి సర్వనాశనం చేసింది. ఈపొలంలో మళ్లీ ఏపంట వేయాలో అర్థం కావడంలేదు ప్రబుత్వం రైతుల కష్టాలను గమనించి ప్రభుత్వం పరిహారం పెంచి ఇవ్వాలి.

11 ఎకరాల్లోపత్తి, 6 ఎకరాల్లో వరి కోల్పోయా

టి.గంగయ్య, వాల్యతండా ఖమ్మంరూరల్



తుఫాన్ వర్షం, వరదలు నన్ను సర్వం దెబ్బతీశాయి. 11 ఎకరాల్లో పత్తి, 6 ఎకరాల్లో వరి పంటవేశా. మొత్తం కోల్పోయా. ఇసుక మేటలు వేసింది. మళ్లీ వ్యవసాయం చేయాలంటే చేతిలో చిల్లి గవ్వలేదు. ప్రభుత్వం ఆదకుంటేనే కోలుకుంటాం. ఎకరానికి రూ.10వేలు ఇస్తే సరిపోదు, పొలం శుభ్రం చేయాలంటే ఎకరానికి రూ.25వేల వరకు ఖర్చు వచ్చ పరిస్థితి ఉంది. ఇసుకమేటలు, రాళ్లు కుప్పలుగా ఉన్నాయి. ప్రబుత్వం పెద్దమనసుతో ఆదుకోవాలి.

5 ఎకరాల్లో వరి పంట కోల్పోయా

ధరావత్ రామారావు, వాల్యాతండా, ఖమ్మంరూరల్ మండలం



నాకు సొంత 2 ఎకరాలతో పాటు మరో 3ఎకరాలు కౌలు తీసుకుని వరి పంటవేశా. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టా. వరి మంచిగా ఎదుగుతున్న తరుణంలో మున్నేరు వరద ముంచేసింది. మొత్తం రాళ్లు కుప్పలు పోసింది. పొలం శుభ్రం చేయడానికే ఎకరానికి రూ.15నుంచి20వేలు ఖర్చయ్యే పరిస్థితి. ప్రభుత్వం రూ.10వేలు ఇస్తే సరిపోదు. కనీసం రూ.25వేలు పెట్టుబడి అయినా ఇవ్వాలి.

ఎడమకాల్వ గండ్లకు మరమ్మతులు

- పనులు ప్రారంభించిన అధికారులు
- రూ.19 కోట్లతో ప్రతిపాదనలు
- నేడు పరిశీలించనున్న కేంద్ర బృందం



పాలేరు జలవిద్యుత్ కేంద్రం వద్ద గండిని పూడ్చివేస్తున్న దృశ్యం

కూసుమంచి, సెప్టెంబరు 10: సాగర్ ఎడమకాల్వ కట్టకు అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా ఎడమకాల్వకు పెద్దఎత్తున గండ్లు పడిన సం గతి తెలిసిందే. మంగళవారానికి వర్షాలు తెరపివ్వడంతో అధికారలు ఎడమకాల్వకు గండ్లు పూడ్చే పనులు ప్రారంభిచారు. జలవిద్యుత్‌కేంద్రం వద్ద సుమారు 50మీటర్ల వెడల్పులో గండిపడగా వరదనీరు వృధాగా బయటకు వెళుతోంది. మొదట దీనిని పూడ్చేందుకు అధికారులు నిర్ణయించి మరమ్మతులు ప్రారంభించారు. అందుకు జేసీబీలసాయంతో మట్టిని తరలించి పూడ్చుతున్నారు. కట్టకు అడ్డంగా మట్టికొట్టుకపోకుండా మట్టిసంచుల్లో వేసి నింనింపతున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు నిర్వహిస్తున్నారు.

పాలేరు జలాశయం అవుట్‌ఫాల్ పక్కన జలాశయం మినీ హైడల్ ప్రాజెక్టు వద్ద రెండుచోట్ల భారీ గండిపడింది. అదేవిధంగా రెండోజోన్ ప్రధానకాల్వ 140 కిలోమీటరు వద్ద సుమారు 150 మీటర్ల గండిపడింది. అదేవిధంగ దానికెదురుగా యూటీ అండర్‌టన్నెల్ వరదకు కొట్టుకపోయింది. మొదటిజోన్ పరిధిలో నడిగూడెం మండలం రామచంద్రాపురం 132 కిలోమీటరు వద్ద, ఎస్కేప్ రెగ్యులేటర్ 133 కిలోమీటరు వద్ద భారీ గండ్లు పడ్డాయి.

కాగా పాలేరు జలాశయానికి పరీవాహక ప్రాంతాలనుంచి ఇంకా వరదనీరు పోటెత్తుతండటంతో నీటిమట్టం తగ్గడం లేదు. 23అడుగుల గరిష్ట నీటిమట్టానికి 21.5అడుగులమేర నీరు నిల్వ ఉంది. పాలేరు నీటిమట్టం తగ్గకపోవడం మరమ్మతులకు కొంత ఆటంకంగా మారింది. పాలేరు ఇన్‌ఫాల్ కెనాల్ నుంచి నీరు వెనక్కి పోటెత్తుతుంటడంతో రంగులబ్రిడ్జి వద్ద ఆటంకాలు ఏర్పడుతున్నాయి. సాగర్ ఎడమకాల్వకు మొదటిజోన్, రెండోజోన్ పరిధిలో పలుచోట్ల గండ్లుపడటంతో మరమ్మతుల నిమిత్తం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. మొదటిరెండుజోన్ల పరిధిలో లైనింగ్‌తోపాటు, పనులు నిర్వహించేందుకు రూ.19కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. షార్ట్ టెండర్ ప్రక్రియ ద్వారా మంజూరీ అవుతాయని తెలిపారు. మంజూరీ కాగానే శాశ్వత ప్రాతిపదిన పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

సాగర్ ఎడమకాల్వను, పాలేరు జలాశయాన్ని, మునిగిపోయిన పంటలను బుధవారం కేంద్రబృందం పరిశీలించనుంది. పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో ఈబృందం పర్యటించనుంది. జాతీయ ప్రకృతివిపత్తు నిర్వహణ ప్రాధికారసంస్థ పరిశీలించనుంది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి కీర్తి ప్రతాప్ ఎసింగ్ నేతృత్వంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

మున్నేరు బాధితులకు
మార్కెటింగ్ శాఖ సాయం

- ఖమ్మం చేరిన బియ్యం, కూరగాయలు
- కిట్ల కూర్పును పర్యవేక్షించిన తుమ్మల యుగంధర్



కిట్లను పరిశీలిస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 10: ఖమ్మంలో వరదముంపు ప్రాంతాల ప్రజలు ఎదుర్కుంటున్న దుర్భర పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించిన వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వరద బాధితులకు అండగా నిలవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో మార్కెటింగ్ శాఖ ద్వారా నాలుగు లారీల్లో వంద క్వింటాళ్ల బియ్యం, భారీగా కూరగాయలు, నిత్యావసరాలు మంగళవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల తనయుడు, కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ కమర్తపు మురళి, తాతా రఘురాం తదితరులతో కలిసి పర్యవేక్షించారు. ప్రతి కిట్‌లో 5కేజీల బియ్యంతో పాటు కూరగాయలు, నిత్యావసరాలు ఉండేలా చూస్తున్నామని తుమ్మల యుగంధర్ చెప్పారు. మొత్తం 6వేల కిట్లు తయారయ్యాయని తెలిపారు.

ఎమ్మెల్యే 'తెల్లం' భవితవ్యం...!?

- అనర్హత వివాదంలో భద్రాచలం ఎమ్మెల్యే
- పార్టీ ఫిరాయింపు ఆరోపణలపై హైకోర్టు ఆదేశాలతో ఉత్కంఠ
- స్పీకర్ వద్దకు చేరిన వివాదం

భద్రాచలం, సెప్టెంబరు 10: కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి బీఆర్ఎస్ తరపున భద్రాచలం అసెంబ్లీ స్థానంలో డాక్టర్ తెల్లం వెంకట్రావు విజయం సాధించారు. కొద్దికాలం బీఆర్ఎస్‌లో కొనసాగగా అనంతరం ఏప్రిల్ ఏడో తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అయితే అప్పటికే మరో ఇరువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీకి చెందిన నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం హైకోర్టు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నాలుగువారల్లో చర్యలు తీసుకోవాలని లేకుంటే తాము సుమోటోగా విచారించాల్సి వస్తుందని స్పష్టం చేసింది. దీంతో ఎమ్మెల్యే వెంకట్రావు భవితవ్యం ఏ విధంగా ఉంటుంది అనే దానిపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది.

అంతా వ్యూహాత్మకమే

ఎమ్మెల్యేవెంకట్రావు తొలి నుంచి వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. 2023 ఏప్రిల్ లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో ఆ పార్టీ జాతీయ నేత రాహుల్‌గాంధీ సమక్షంలో ఖమ్మంలో వెంకట్రావు చేరారు. అనంతరం 46 రోజుల పాటు ఆ పార్టీలో కొనసాగిన ఆయన తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారు. దీంతో బీఆర్ఎస్ అధిస్టానం ఆయనకు భద్రాచలం అసెంబ్లీ టికెట్ కేటాయించింది. భద్రాచలం అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెంకట్రావు సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్యను ఓడించారు. కాని రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయింది. పైగా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి వెంకట్రావు ఒక్కరే బీఆర్ఎస్ నుంచి ఎన్నికయ్యారు. ఈ క్రమంలో ఆయన తాను కేసీఆర్ వెంటే నడుస్తానని బీఆర్ఎస్‌ను వీడబోనని పలుమార్లు ప్రకటించారు. కానీ వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తూ అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

ఏం జరగబోతోంది?

రాబోయే రోజుల్లో ఏం జరుగుతుంది? ఇది ప్రతి ఒక్కరిలో చోటు చేసుకుంటున్న బహిరంగ చర్చ. మరో వైపు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఇప్పటికే భద్రాచలం అసెంబ్లీ స్థానంపై దృష్టిసారించారనే ఊహాగానాలు ఆపార్టీ నాయకులు, క్యాడర్ ద్వారా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది.

ఇదిలా ఉండగా ఎమ్మెల్యే వెంకట్రావు మాత్రం నియోజకవర్గ ప్రజల మనోభీష్టం, అభివృద్ధి కోసమే తాను ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని దానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేస్తున్నారు. గతంలో రెండు దఫాలు అధికారంలో ఉన్న సమయంలో బీఆర్ఎస్ కాంగ్రెస్, టీడీపీ ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు ప్రజాస్వామ్య విలువలు గుర్తుకు రాలేదా అని వెంకట్రావు ప్రశ్నిస్తున్నారు. హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తామని, పూర్వాపరాలు పరిశీలించిన తరువాత పూర్తిగా వ్యాఖ్యానిస్తామని తెలిపారు.

క్రైం సమాచారం

ఐదురోజులైనా ఆచూకీ లేని సాయి

» కిన్నెరసాని వాగు వద్ద గల్లంతు

» నా భర్త ఆచూకీని వెతకాలని భార్య వేడుకోలు



సాయి(ఫైల్)

పాల్వంచ రూరల్, సెప్టెంబరు10: కిన్నెరసాని ప్రవాహంలో తన భర్త గల్లంతై ఐదు రోజులైంది.. ఆ చూకీ ఎక్కడ కనిపించడం లేదు.. నా భర్తను వెతకండంటూ గల్లంతైన జారె సాయి భార్య మమత కన్నీటి శోకంతో అధికారులను వేడుకుంటోంది. పాల్వంచ మండలంలోని దంతెలబోర, బంద్రిగొండ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది ఐదు రోజుల క్రితం పశువులను మేపేందుకు కిన్నెరసాని వాగు దాటి వెళ్లారు. ఎనిమిది మందిలో ఏడుగురిని అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వీరిలో జారె సాయి కిన్నెరసాని ప్రవాహంలో గల్లంతయ్యాడు. రెండు రోజులు అధికారులు ఎండీఎఫ్, డీడీఆర్ఎఫ్ బృందాలతో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. గల్లంతైన అతడికి భార్య మమత, దీక్షిత శ్రీ, హర్షిత శ్రీ ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. సాయి ఆచూకీ కనుగొనాలని అధికారులను ఆమె ప్రాధేయపడుతోంది. తన భర్తను వెతుకులాడమని కన్నీరుమున్నీరవుతోంది. అధికారులు మరోసారి బృందాలతో గాలించాలని వేడుకుంటోంది.

గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

చింతకాని, సెప్టెంబరు 10: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని తుమ్మలమ్మ చెరువులో గల్లంతైన వీరయ్య మృతదేహాన్ని స్థానిక జాలరులు మంగళవారం గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, అన్నం సేవా ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. అన్నం శ్రీనివాసరావు వారి బృందం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కర్ర ట్రాక్టర్లపై కేసు నమోదు

బూర్గంపాడు, సెప్టెంబరు 10: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గల ఐటీసీ కర్మాగారానికి ముడిసరుకును తరలిస్తున్న ట్రాక్టర్లపై మంగళవారం బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీపురం యార్డు నుంచి ప్రమాదకరంగా అధిక లోడుతో ఐటీసీకి కర్రను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్లపై పరిమితికి మించి ప్రమాదకరంగా కర్రను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రాజేష్ ట్రాక్టరు యాజమానులకు సూచించారు.

చెల్లని చెక్కు కేసులో వ్యక్తికి ఆరు నెలలు జైలు

ఖమ్మం లీగల్ సెప్టెంబరు 10: రఘునాథపాలెం మండలం బూడిదంపాడు గ్రామానికి చెందిన చెల్లని చెక్కు కేసులో నిందితుడైన కేలోత్ భద్రుకు 6 నెలలు జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి 60వేల రూపాయలను చెల్లించాలని ఖమ్మం మధ్యపాన అబ్కారి ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రాళ్లబండి శాంతిలత మంగళవారం తీర్పుచెప్పారు. కేసు వివరాల ప్రకారం.. కామేపల్లి మండలం, పండితాపురం గ్రామానికి చెందిన ఫిర్యాది దిరిశాల కోటేశ్వరరావు వద్ద నిందితుడు తన కుటుంబ అవసరాల నిమిత్తం 2015 డిసెంబరు 1న రూ.44వేలను అప్పుగా తీసుకొని అదే రోజు ప్రాంసరీనోటు రాయించి ఇచ్చాడు. ఫిర్యాది తన రుణాన్ని తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితుడు 2017 ఆగస్టు 15న చెక్కును ఇచ్చాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా, నిందితుడి ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. ఫిర్యాది తన న్యాయవాది అయిన పాటిబండ్ల సంజయ్య ద్వారా లీగల్ నోటీసు జారీచేసి కోర్టులో నిందితుడిపై ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. అట్టి కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువుకావడంతో శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి జైలు..

ఖమ్మం లీగల్ సెప్టెంబరు 10: కామేపల్లి మండలం కొత్తలింగాల గ్రామానికి చెందిన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరు నిందితులు ఏ1 పండగ నాగేంద్రబాబు(22), ఏ2 పండగ రాంబాబు(24) లకు ఏ1కు 20 ఏళ్ల శిక్షతోపాటు రూ.50వేల జరిమానా, ఏ2కు 10 ఏళ్ల శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి మంగళవారం తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఫిర్యాది కూతురు కాలేజీకి ఆటోలో వెళుతున్నప్పుడు నిందితుడు మైనర్ బాలికను అడ్డగించి ఆమెను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డారని 2019 నవంబరు 8న స్థానిక కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. కేసును విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో ఇరువురికి జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండీ. ఇర్షాద్, లైజన్ ఆఫీసర్ కె.మోహన్‌రావు, హోమ్‌గార్డు చిట్టిబాబు సహకరించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

పినపాక, సెప్టెంబరు10: మనస్తాపంతో మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏడూళ్లబయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ (30) ఈ నెల 5న సదరు మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించింది. ఈ క్రమంలో ఆమె పిల్లలు ఇంట్లోకి రావడంతో, అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తి పారిపోయాడు. మనస్తాపం చెందిన ఆమె, ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను కుటుంబ సభ్యులు మణుగూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమె బతికుండగానే తనపై అత్యాచారానికి ఓ వ్యక్తి పాల్పడినట్లు చెప్పడంతో, ఆమె భర్త ఆదేశాలతో, మృతురాలి సోదరులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 10: దూషించిన వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. మంగళవారం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సన్యాసిబస్తీలో గల కోటా శివశంకర్ అనే వ్యక్తి ఇంట్లో భూక్యా వీరభద్రం గత నాలుగేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లు చెల్లించాలని దుర్భాషలాడిన ఇంటి యజమానిపై అద్దెకు ఉన్న వీరభద్రం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇంటి యజమాని శివశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వెంకటాపురంలో పెద్దపులి సంచారం లేదు

● అడవి పిల్లి పాదముద్రలుగా ధ్రువీకరించిన అధికారులు



కల్లూరు, సెప్టెంబరు 10 మండల పరిధిలోని టీ. వెంకటాపురం గ్రామంలో పెద్దపుల్లి సంచారం జరగలేదని కల్లూరు అటవీశాఖ అధికారి రామ్‌సింగ్ తెలిపారు. సోమవారం టీ. వెంకటాపురం గ్రామ వాగు పరివాహక ప్రదేశంలో పెద్దపులి ఆకారం గల జంతువు కనిపించడంతో ఓ రైతు గ్రామ ప్రజలకు సమాచారం అందించాడు. దీంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురియైన విషయం విధితమే. సోమవారం రాత్రి చీకటిగా ఉండటంతో జంతు పాదముద్రల సేకరణకు అంతరాయం కలిగింది. దీంతో మంగళవారం అటవీశాఖ అధికారి రామ్‌సింగ్, బీట్‌ఆఫీసర్లు ఎండి అజమ్‌అలీ, భరత్‌కుమార్‌లు క్షేత్ర స్థాయిలో సదరు ప్రదేశానికి చేరుకోని జంతు పాదముద్రలు సేకరణ చేయగా అవి అడవి పిల్లి పాదముద్రలని ధ్రువీకరించారు. టీ. వెంకటాపురం గ్రామంలో పెద్దపులి సంచారం జరగలేదని ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శి నిర్బంధం

● విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

దమ్మపేట, సెప్టెంబరు 10: పంచాయతీలో బ్లీచింగ్ పనులు చేయటం లేదంటూ దూషిస్తూ కార్యదర్శిని గదిలో నిర్బంధించి విధులకు ఆటంకం కలిగించిన ఘటన లచ్చాపురంలో మంగళవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లచ్చాపురం గ్రామానికి చెందిన తాళ్ల సురేష్ అనే వ్యక్తి పంచాయతీ కార్యదర్శి గంగుల రవిని పారిశుధ్య పనులు చేయడం లేదంటూ తీవ్ర పదజాలంతో దూషిస్తూ కార్యదర్శిని గదిలో నిర్బంధించి తాళం పెట్టాడు. ఈక్రమంలో కొందరు గ్రామస్థులు సురేష్‌కు నచ్చ చెప్పినప్పటికి దూషిస్తూ బెదిరించాడు. ఎంతచెప్పినప్పటికి వినకపోవడంతో కొందరు గ్రామస్థులు 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈఘటనకు సంబంధించి కార్యదర్శి రవి తనను నిర్బంధించి విధులకు ఆటంకం కలిగించాడని మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా, తాళ్ళ సురేష్ అతనికి సహకరించిన మరోక వ్యక్తిపై ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పెరిగిన వరద నష్టం అంచనాలు

» మొత్తం 729.68 కోట్లు నష్టం జరిగినట్టు నివేదికలు » నేడు, రేపు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



వరద ముంపునకు గురైన ఓ ప్రాంతం(ఫైల్)

ఖమ్మం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో జరిగిన వరద నష్టం అంచనాలు మరింతగాపెరిగాయి. అన్నిశాఖలకు కలిపి శాఖల వారీగా మొత్తం 729.68కోట్లు నష్టం జరిగినట్టు నివేదికలు సిద్ధం చేశారు. కేంద్ర బృందంజిల్లాలో జరిగిన ఆస్థి, పంటల నష్టాన్ని బుధ,గురువారాల్లో రెండురోజులపాటు తిలకించి కేంద్రానికి నివేదిక ఇవ్వనుంది. కేంద్ర బృందానికి పూర్తి స్థాయిలో జరిగిననష్టాన్ని వివరించేందుకు జిల్లా లో అన్ని ప్రభుత్వశాఖలు నివేదికలుసిద్ధం చేశాయి. ఈనివేదికలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఆరుగురు మృతిచెందగా రూ.30లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పటి వరకు చెల్లించారు. దెబ్బతిన్న ఇళ్లకురూ.25కోట్ల 33లక్షలు, పశుసంవర్ధకశాఖకు కోటి 48లక్షలు, ఆర్‌అండ్‌బీకి రూ.151.69కోట్లు, పీఆర్‌కు 34.77కోట్లు, నీటిపారుదల శాఖకు కాలవలు చెరువుల నష్టం రూ.434.7కోట్లు, విద్యాశాఖ భవనాలకు 1కోటి 20లక్షలు, ఆరోగ్యశాఖ ఆసుపత్రులకు రూ.30లక్షలు, విద్యుత్‌శాఖకు రూ.7.73కోట్లు, వ్యవసాయాశాఖ కు రూ.68.34కోట్లు, ఉద్యానశాఖకు రూ.68.34కోట్లు, మత్స్యశాఖకు రూ.4.44కోట్ల నష్టం జరిగిందని, తద్వారా రూ.729.68కోట్ల నష్టం జరిగిందని అంచనాలు సిద్ధం చేశారు.

శాఖల వారీగా ఇలా

జిల్లా వ్యాప్తంగా మొత్తం 15258 ఇళ్ల కు నష్టం జరగ్గా 150గుడిసెలు,షెడ్లు పడిపోయాయి. 15096 ఇళ్లకు పాక్షిక నష్టం వాటిల్లింది. జిల్లాలో పశుసంవర్ధకశాఖ .పరంగా ఆవులు 41 చనిపోగా రూ.20.50లక్షలు దూడలు 8చనిపోగా రూ.1.60లక్షలు, గేదెలు 63చనిపోగా 31.50లక్షలు, గొర్రెలు109చనిపోగా రూ.5.45లక్షలు, మేకలు 197 చనిపోగా రూ.9.85లక్షలు, కోళ్లు 77353 చనిపోగా రూ.77.35లక్షలు, పదులు 50చనిపోగారూ.2.50లక్షలుకలిపి మొత్తం 77,821 కోళ్లు పశువులు మృతిచెందగా రూ.కోటి48లక్షల75వేలనష్టం జరిగింది. వ్యవసాయపంటల పరంగా పత్తి 16727మంది రైతులకు 27639 ఎకరాలకు రూ.27.63కోట్లు, మొక్కజొన్న 25మందిరతుల 47 ఎకరాలకు రూ.4.70లక్షలు, పెసర 892మంది రైతులకు 660 ఎకరాల్లో రూ.66లక్షలు, వరి 26607 రైతులకు 35,590 ఎకరాల్లో రూ.35.59కోట్లు నష్టం జరిగింది. మొత్తంగా వ్యవసాయశాఖ పరిధిలో 43651మంది రైతులకు 63936 ఎరాల్లో రూ.63.93కోట్ల మేర పంట నష్టం జరిగింది.

ఉద్యానశాఖ పరిదిలో మిర్చి 2532 మది రైతులకు 4178 ఎకరాలు రూ.4.17కోట్లునష్టం, కూరగాయలు 155మంది రైతులకు 130 ఎకరాల్లో రూ.13.10లక్షలు, అరటి 13మంది రైతుల 32 ఎకరాల్లో రూ.3.20లక్షలు, బొప్పాయి 23మది రైతులకు 68ఎకరాల్లో రూ.6.58లక్షలు , మొత్తం 46374మంది రైతులకు 68345 ఎకరాల్లో రూ.68.34కోట్లు మేర నష్టం జరిగిందని , మత్స్యశాఖకు చెరువులు, చేపపిల్లలతో సుమారు రూ.4కోట్ల44లక్షలు నష్టం జరిగింది. ఆర్‌అండ్‌బీ శాఖకు 41.98కి.మీ. రోడ్లు గండ్లు పడగా 82.50కిమీ రోడుల దెబ్బతిన్నాయి. 22చోట్ల అప్రోచ్‌లు దెబ్బతిన్నాయి. మొత్తం 151.69కోట్లకు నష్టం జరిగింది.

పీఆర్‌శాఖలో 3378 కి.మీ. పొడవున రోడ్లు దెబ్బతినగా 21చోట్ల గండ్లుపడ్డాయి 40సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. మొత్తంగా రూ.34.77కోట్లు నష్టం జరిగింది. నీటిపారుదలశాఖలో 69 చెరువులు, 34కాలవలు, 6 ఐడీసీపనులు మొత్తం 99చోట్లదెబ్బతిన్నాయి. శాశ్వత మరమ్మత్తుల కోసం రూ434 కోట్ల 7లక్షలు అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో 66 పాఠశాలలకు కోటి 60లక్షలు, ఆసుపత్రులురూ.30లక్షలు, విద్యుత్‌శాఖకు రూ.7.73కోట్లు మొత్తంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులకు రూ.9.23కోట్లు నష్టం జరిగింది. ఈమేరకు నష్టం అంచనాలను అధికారలు సిద్ధం చేశారు.కేంద్ర బృందానికి సమర్పించనన్నారు.

బాధితులకు సత్వరం నష్ట పరిహారం చెల్లించాలి

» జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ సెప్టెంబరు 10: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా రోడ్డు ప్రమాద నష్టపరిహార కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించి బాధితులకు సత్వరం నష్టపరిహారం అందించాల్సిన అవసరం ఉందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ అన్నారు. మంగళవారం న్యాయాధికారి బీమా కంపెనీ అధికారులు, న్యాయవాదులు, మెజిస్ట్రేట్‌లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మరణం సంభవించిన కేసులలో నష్టపరిహారం లెక్కించడం సులువైన విషయమని, కాబట్టి ఇటువంటి కేసులను సత్వరం పరిష్కరించాలని బీమా కంపెనీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాసంస్థ కార్యదర్శి కె.వి.చంద్రశేఖరరావు, మెజిస్ట్రేట్లు కె.దీప, బి.రజని, వై.బిందుప్రియ, వి.మాధవి, ఆర్.శాంతిలత, ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణమోహన్, రెండవ శ్రేణి మెజిస్ట్రేట్ సలీం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరేళ్ల శ్రీనివాసరావు, బీమా కంపెనీ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమయంలో సెల్‌ఫోన్‌ను వినియోగించొద్దు

» ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట, సెప్టెంబరు 10: పాఠశాల సమయంలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌ను వినియోగించవద్దని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కోరారు. గండుగులపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి విద్యావిధానం, బోధన అంశాలపై ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల విధి నిర్వహణలో సమయంలో, విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే సమయంలో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌ను వినియోగించవద్దని కోరారు. నియోజక వర్గంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఇదే విధానాన్ని కొనసాగించాలని అన్నారు. అత్యవసర సమయంలో తప్ప దానిని వినియోగించ వద్దన్నారు. తన గ్రామంలోని పాఠశాల నుంచే ఈవిధానాన్ని అవలంబించి అన్ని పాఠశాలలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. దీనిపై స్పందించిన ఉపాధ్యాయులు విధి నిర్వహణ సమయంలో సెల్‌పోన్ వినియోగించమని ఉపాధ్యాయులు తీర్మానం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ కుంభకోణంపై హైకోర్టులో రిట్

» గనికార్మికుల సొమ్ము కాజేసిన బడా బాబులపై బీఎంఎస్ న్యాయ పోరాటం

» సీబీఐ విచారణతో సొమ్ము రికవరీకి అప్పీలు


ఆంధ్రజ్యోతి
పింఛన్ సొమ్ముతో
వంచన

ఇల్లెందు, సెప్టెంబరు 10: బొగ్గు గనుల కార్మికుల భవిష్య నిధి (పీఎంపీఎఫ్) నిధులను కొల్లగొట్టిన ఉన్నతస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని, వారి నుంచి నిధులు రికవరీ చేసేందుకు సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ భారతీయ మజ్దూర్‌సంఘ్(బీఎంఎస్) న్యాయ పోరాటం చేపట్టింది. దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కార్మికులు ఉద్యోగుల భవిష్య నిధి నిర్వహించే కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్‌వో) కమిషనర్, కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి తదితర ఫండ్ నిర్వాహకుల నిర్లక్ష్యం, కార్మికుల సొమ్ము పెట్టుబడిగా పెట్టిన దివాన్‌హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ దివాళా తీయడం, కార్మికుల సొమ్ము రూ.727 కోట్లు నష్ట పోయిన పరిణామాల నేపథ్యంలో ఆగస్టు 26న 'ఆంధ్రజ్యోతి'లో 'పింఛన్ సొమ్ముతో వంచన' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ మేరకు బీఎంఎస్-అఖిల భారత ఖదాన్ మజ్దూర్ సంఘ్ అనుబంధ సింగరేణి కాలరీస్ పెన్షన్‌దారుల వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సీఎంపీఎఫ్‌వోలో జరిగిన నిధుల కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని, దివాళా కంపెనీ నిధులపై నిర్లక్ష్యం చేసిన బాధ్యులైన అధికారుల నుంచి నిధులు రికవరీ చేయాలని బీఎంఎస్ నాయకులు న్యాయ పోరాటానికి పూనుకోవడం బొగ్గు పరిశ్రమ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ మేరకు అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి మందా రమాకాంత్ హైకోర్టులో రిట్ పిటిషన్ (నెంబర్ 20799/2024) దాఖలు చేశారు. దేశవ్యాప్తంగా బొగ్గుగనుల కార్మికుల పెన్షన్ ఫండ్ నిధులు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సి ఎంపీఎఫ్‌వో) అధికారులు దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలో పెట్టుబడులు పెట్టారని, నిధులపై నిర్లక్ష్యం చేయడం, సమయానుకూలంగా నాన్‌కన్వర్టబులిటి డిబెంచర్లను రిడంప్షన్ చేయలేదని, ఫలితంగా దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ దివాళా పిటిషన్ దాఖలు చేయడంతో రూ.727.67 కోట్లు పెన్షన్‌ఫండ్ సీఎంపీఎఫ్‌వో నష్ట పోయిందని పిటిషనర్ కోర్టుకు వివరించారు. ఈ కుంభకోణంపై సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని, రూ.727కోట్ల కుంభకోణానికి కమిషనర్‌ను బాధ్యుడిగా గుర్తించి అతడి నుంచి కార్మికుల సొమ్ము రికవరీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానం ను అభ్యర్థించారు. ఈ మేరకు హైకోర్టు ప్రతివాదులుగా పేర్కొన్న కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి. సీఎంపీఎఫ్ ఓ కమిషనర్. ఎస్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆఫ్ ఫండ్స్.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)లను కౌంటర్లు దాఖలు చేయవలసిందిగా హైకోర్టు ఈ నెల 5న నోటీసులు జారీచేసింది.

అటవీ సంపద అమ్మకం

» అర్బన్ పార్క్ సరిహద్దులో స్థలం రూ.10వేలకు అమ్మకం

» వన్యప్రాణుల వేటగాళ్ల నుంచి నగదు వసూళ్లు

» వరస ఫిర్యాదులతో అధికారుల విచారణ

» బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసిన డీఎఫ్‌వో

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 10: కంచె చేను మేసిన చందంగా ఉంది అటవీశాఖ అధికారి తీరు. స్వచ్ఛంద సంస్థల నుంచి అన్ని ప్రభుత్వశాఖలో ఒక వైపు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి మొక్కలను నాటుతున్నారు. అక్రమ సంపదనకు అలవాటు పడి ఓ అటవీశాఖ బీట్ అధికారి అటవీ సంపదనే అమ్మకం చేయడంతో విచారణ చేపట్టిన జిల్లా అటవీశాఖ అధికారులు ఆ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.

ఖమ్మం నగరానికి సరిహద్దులో అటవీశాఖ పర్యవేక్షణలో 260 ఎకరాల్లో ఖమ్మం అర్బన్ పార్క్ నిర్మాణం జరిగి, పూర్తి అటవీశాఖ పర్యవేక్షణలో కొనసాగుతోంది. అక్రమార్కులు అటవీ భూములు కబ్జాలు చేయకుండా చైన్ లింక్‌తో సరిహద్దులను ఏర్పాటు చేశారు. అయితే చింతకాని మండలం నుంచి ఖమ్మం అర్బన్ పార్క్‌కు 11 నెలల క్రితం బీట్ ఆఫీసర్ జీ. రమేష్ బదిలీపై వచ్చారు. అటవీ భూములకు సమీపంలోనే ప్రైవేట్ వెంచర్ ఉంది. వెంచర్‌లోని ఓ స్థల యజమాని కొంత అటవీభూమిలోని చెట్లను నరికి అన్యాక్రాంతానికి ప్రయత్నించాడు. దీంతో విషయం తెలుసుకున్న అధికారి చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలించి, అన్యాక్రాంతం చేసిన ప్లాట్ యజమాని నుంచి రూ.10వేలు డిమాండ్ చేసి తీసుకున్నారు. కాగా ఇద్దరి మధ్య వివాదం రావడంతో బీట్ ఆఫీసర్ రమేష్‌కు డబ్బులు ఇచ్చిన స్థల యజమాని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఇదిలా ఉంటే వారం రోజుల క్రితం ఖమ్మం అర్బన్ పార్క్‌లో వన్యప్రాణులను వేటాడేందుకు ఓ వేటగాడు పార్క్‌లో ఆటోతో పొంచి ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఆ అధికారి వేటగాడు ఉన్న ఆటోను తనిఖీ చేయగా, అందులో వేటాడేందుకు కావాల్సిన వలలు, ఉచ్చులు కనిపించాయి. తర్వాత ఆటోను స్వాధీనం చేసుకున్న బీట్ ఆఫీసర్ అతడిపై కేసు నమోదు చేసి, జరిమానా విధించకుండా ఆటోను స్వాధీనం చేసుకొని రెండు రోజులు తన వద్దనే ఉంచుకొని రూ.10వేలు ఇవ్వాలని బేరం పెట్టాడు. దీంతో ఆ వేటగాడు రూ.3,500 ఇచ్చి తన ఆటోను విడిపించుకున్నాడు. ఇలా వరస ఫిర్యాదులు రావడంతో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థవిక్రమ్‌సింగ్ విచారణ చేపట్టారు. బీట్ ఆఫీసర్ రమేష్‌ను సస్పెండ్ చేశారు. కాగా ఇదే ఈ అధికారి ఏడాది క్రితం చింతకాని మండలంలో పని చేసిన కాలంలోను అనేక అవినీతి విమర్శలు ఎదుర్కొని విచారణలు ఎదుర్కొన్నట్లు అటవీశాఖలో చర్చ జరుగుతుంది.

మధిర మునిసిపాలిటీ కార్యాలయంలో చెత్తతో నిరసన

» సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకుల ఆందోళన



చెత్తతో నిరసన సీపీఎం నాయకులు

మధిరరూరల్, సెప్టెంబరు 10: మధిరలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తూ దుర్గంధం వెదజల్లుతుందని ఆరోపిస్తూ మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు చెత్తను తీసుకువచ్చిన మునిసిపాలిటీ కార్యాలయ ఆవరణలో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్, పాలకవర్గానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయ ఆవరణలో భోజనాలు చేసి నిరసన తెలిపారు. అనంతరం సీపీఎం పట్టణ నాయకుడు పాపినేని రామనర్సయ్య, శీలం నర్సింహారావులు మాట్లాడుతూ మధిర టౌన్‌లో ఏవీధిలో చూసినా ఎక్కడ పడితే అక్కడ చెత్త కన్పిస్తూ దుర్వాసన వెదజల్లుతుందని విమర్శించారు. అనంతరం కమిషనర్ షఫీ ఉల్లా నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీపీఎం నాయకులు కూడా కమిషనర్‌తో వాదనకు దిగారు. అనంతరం మధిర సీఐ మధు మునిసిపల్ కార్యాలయం వద్దకు చేరుకుని సీపీఎం నాయకులతో మాట్లాడారు. కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం నాయకులు సీఐ మధు, మునిసిపల్ అధికారులు కలిసి అధ్వానంగా ఉన్న రోడ్లను చూపించేందుకు వెళ్లారు. రైల్వేస్టేషన్ వద్ద అధ్వానంగా ఉన్న రహదారిని సీఐకు చూపించారు. రోడ్లకు మరమ్మతులు చేసేందుకు, పారిశుధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సీఐ చొరవతో సీపీఎం నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మందా సైదులు, పడకంటి మురళీ, మద్దాల ప్రభాకర్, మండవ ఫణీంద్రకుమారి, మధు పాల్గొన్నారు. వీరికి కాంగ్రెస్ నాయకుడు కౌన్సిలర్ భర్త అయిన యర్రగుంట రమేష్ సంఘీభావం తెలిపారు.

నిలిచిన అంతరాష్ట్ర రాకపోకలు



సారపాకలో బారులు తీరిన లారీలు

బూర్గంపాడు, సెప్టెంబరు 10: ఎగువన కురిసిన వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మంగళవారం సాయంత్రానికి 48అడుగులకు చేరుకోవడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరి వరద ఉధృతితో బూర్గంపాడు, భద్రాచలం మండలాల మీదుగా ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే భారీ వాహనాలను అధికారులు సారపాకలో నిలిపివేశారు. దీంతో జాతీయరహదారిపై లారీలు బారులు తీరాయి. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా గోదావరి వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా మండల పరిధిలో ఐదు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ముజాహిద్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి వరదతో కిన్నెరసాని వాగు ఒడ్డున ఉన్న పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 10: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని ఉద్యోగుల పిల్లలు ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల యువతీ, యువకులు ఐటీఐ, అప్రెంటిస్ శిక్షణ పొందేందుకు దరఖాస్తులను కోరుతున్నట్లు ఏరి యా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిస్టరీ ఆఫ్ స్కిల్‌డవలప్‌మెంట్ అం డ్ ఎంటర్‌ప్రైజేస్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ లో అప్రంటీస్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ వెబ్‌సైట్ పోర్టర్‌ను తమ అర్హత వివరాలను పొందుపర్చాలని సూచించారు.

పోలీస్ జాగిలం పైనీ అందించిన సేవలు మరువలేనివి

» ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్





పోలీస్ జాగిలం పైనీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్

కొత్తగూడెం, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్‌శాఖకు పోలీస్ జాగిలం పైనీ అందించిన సేవలు మరువలేనివని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ జాగిలం గత నెల రోజులుగా బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ తుది శ్వాస విడిచింది. పేలుడు పదార్థాలను కనిపెట్టడంలో నైపుణ్యత కలిగిన పైనీ మరణించడం జిల్లాకు తీరని లోటని అన్నారు. 30కి పైగా పేలుడు పదార్థాలను గుర్తించిన ఘటన పాల్గొని సమర్థవంతంగా విధులను అందించిందని ఎక్కువ శాతం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తన సేవలు అందించిందని తెలిపారు. అనంతరం పైనీ భౌతిక కాయానికి పోలీస్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓఎస్‌డీ కార్యాలయంలోని డాగ్ స్క్వాడ్ నుంచి అంతిమయాత్రగా బయలుదేరి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పైనికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, ఆర్ఐ ఆపరేషన్స్ రవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో గాయపడిన కానిస్టేబుళ్లు హైదరాబాద్‌కు తరలింపు

భద్రాచలం, సెప్టెంబరు 10: ఇటీవల భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాయపడి భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు సందీప్, వంశీలను మెరుగైన వైద్యం కోసం మంగళవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తరలించారు. రఘునాథపాలెం అటవీప్రాంతంలో ఈ నెల 5న జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్లు గాయపడగా వారిని భద్రాచలంకు తరలించి వైద్య చికిత్స అందించారు. కాగా ఇరువురికి మెరుగైన చికిత్స అందించేందుకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తరలించారు.



కానిస్టేబుల్‌ను హెలికాప్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

మిడ్డేమీల్స్ కార్మికుల హామీని అమలు చేయాలి: ఏఐటీయూసీ

కొత్తగూడెం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన రూ.10వేల వేతన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ మిడ్డేమీల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూఎన్నికలు పూర్తై అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు మేనిఫెస్టోలో పేర్కొన్న రూ.10వేల గౌరవ వేతనం అమలు చేయడం లేదన్నారు. పాఠశాలల్లో వంటా, వార్పు పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి కార్మికులకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తోందని, ఈ ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, బకాయి బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మల్లిఖార్జున్, సత్తెనపల్లి విజయలక్ష్మి, పుష్ప, మంగ, ప్రభావి తదితరులు పాల్గొన్నారు.

సింగభూపాలెం చెరువు కట్ట పటిష్ఠానికి కృషి

- గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదకర స్థాయికి చెరువుకట్ట
- నష్టం జరగకుండా నీటిపారుదల శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా
- చెరువుకట్టను పరిశీలించిన సీపీఐ బృందం


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సుజాతనగర్, సెప్టెంబరు 10: సుజాతనగర్ మండల పరిసర గ్రామాల రైతులకు ప్రధాన నీటి వనరుగా ఉన్న సింగభూపాలెం చెరువు కట్ట పటిష్టతకు నష్టం వాటిల్లకుండా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని, ఇప్పటి వరకు జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించి, రైతులకు న్యాయం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్‌పాషా అన్నారు. మంగళవారం సింగభూపాలెం చెరువు కట్ట, పరివాహక ప్రాంతాలను, రైతుల వ్యవసాయ భూములను ఆయన సీపీఐ బృందంతో కలిసి సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ చెరువు ఆయకట్టు రైతులు అధైర్యపడవద్దని, చెరువు కట్ట పరిస్థితిని ముందుస్తుగానే గుర్తించిన ఎమ్మెల్యే నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నేడు చెరువుకట్టకు ఇలాంటి దుస్థితి ఏర్పడిందని, రూ.26 కోట్ల వ్యయంతో చేపట్టిన కరకట్ట మరమ్మత్తు పనులు నాణ్యత లోపించి కుంగిపోతోందని, ఈ పనుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాతో పాటు నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్టు నీటి పారుదలకు కూనంనేని కృషి చేస్తున్నారని అన్నారు. అధిక వర్షాలకు చెరువు కట్ట కృంగుబాటుకు గురవుతోందని అన్నారు. ప్రజలకు, రైతులకు ఎలాంటి నష్టం జరుగకుండా చూడాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు అధికారులు సర్వే చేసి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దస్రు, జిల్లా నాయకులు చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, కొమారి హనుమంతరావు, తాళ్ల వెంకటేశ్వరరావు, భాగం శేషభూషణం, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, పొదిల శ్రీనివాసరావు, వీర్ల మల్లేష్, కోమారి కృష్ణ, బొడ్డు కేశవరావు, భాగం కృష్ణ, దండు నాగేశ్వరరావు, గడ్డం రాజేందర్, దండు సురేష్, ఆకుల వెంకన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అన్నదాత ఆగమాగం

- వందల ఎకరాల్లో కొట్టుకు పోయిన వరి, పత్తి పంటలు
- పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్


వరదలకు దెబ్బతిన్న పత్తి పంట

అశ్వాపురం సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. అప్పులు చేసి వేసిన పంటలు వరదకు కొట్టుకు పోవటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొటు మిట్టాడుతున్నారు. వందల ఎకరాల్లో వరి, పత్తి పంటలు నీటమునగటంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాలకు తుమ్మలచెరువు అలుగు ఉప్పొంగటంతో అలుగు తీరప్రాంతంలోని భీమునిగుండం కొత్తూరు, మొండికుంట, మల్లెలమడుగు గ్రామాలకు చెందిన పలువురు రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేయటం, వరి నాట్లు వందల ఎకరాల్లో కొట్టుకు పోవటంతో భారీ నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.లక్షవరకు నష్టపోయామని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కొందరు రైతుల పొలాల్లో భారీగా గండ్లు పడటంతో ఖరీఫ్ తో పాటు రబీ పంటలు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మరో వైపు గొందిగూడెం, ఎలకలగూడెం, తుమ్మలచెరువు గ్రామాల్లో పత్తిచేలు భారీ వరదకు నేలవాలాయి. మరో నెలలో పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షం తమను కోలుకోలేని దెబ్బతీసిందని,ఇప్పటికే ఒక్కో ఎకరానికి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు పేర్కొంటున్నారు. భారీ వర్షంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని బాధి త రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఐదు ఎకరాలపత్తి నేలవాలింది

చాప ప్రవీణ్, యువరైతు గొందిగూడెం



ఈఏడాది ఖరీఫ్‌లో తనకు ఉన్న రెండు ఎకరాలతో పాటు, మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని 5 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. మొత్తం రూ.3లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. భారీవర్షంతో ఇసుకవాగు ఉప్పొంగటంతో సాగు చేసిన 5 ఎకరాల్లో పత్తి చేను నేలమట్టమయ్యింది. అప్పులు ఎలాతీర్చాలో అర్థం కావటం లేదు ప్రభుత్వమే ఆదుకోవాలి.

రెండుఎకరాల్లో ఇసుకమేట వేసింది

ఆవుల రవి, రైతు మల్లెలమడుగు



భారీ వర్షానికి తుమ్మలచెరువు అలుగు ఉప్పొంగటంతో తాను సాగు చేసిన రెండు ఎకరాల వరి పంట నీటమునిగి పొలంలో భారీగా గండ్లుపడి ఇసుక మేటలు వేసింది.రూ2లక్షల మేర నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌తో పాటు,రబీ సాగు కూడా చేసే అవకాశం లేదు.

నష్టం అంచనాలు రూపొందించాం

సాయి శంతన్‌కుమార్, వ్యవసాయాధికారి



భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు సంబంధించి ప్రాథమిన నివేదికను ఉన్నతాధికారులకు నివేదించాం. మండల వ్యాప్తంగా 500ఎకరాల్లో వరి,300ఎకరాలు పత్తి పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేశాము.ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు పరిహారం చెల్లిస్తాం.

ఆత్మహత్యల నివారణపై వైద్యశాఖ అవగాహన

జూలూరుపాడు, సెప్టెంబరు 10: ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులు, వివిధ సమస్యలతో ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడంతో వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జూలూరుపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆత్మహత్యల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు వచ్చినప్పుడు వాటిని స్నేహితులతో, కుటుంబ సభ్యులతో పంచుకొని పరిష్కరించుకోవాలే తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రామకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టాలి

జూలూరుపాడు, సెప్టెంబరు 10: వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వారందరిని ప్రభుత్వాసుపత్రికి తరలించి సేవలను అందించాలని వైద్యాధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఏఎన్ఎంల, ఆశాకార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని, జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిహెచ్‌ఓ రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చాంబర్ ఆఫ్ కామర్స్ వితరణ

మణుగూరు, సెప్టెంబరు 10: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన వరద బాధిత కుటుంబాలకు మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ మద్దుల గూడెం, కూనవరం, సమితి సింగారం ప్రాంతాల్లో నిత్యావసరాలు పంపిణీ చేసింది. శివకామేశ్వరి గ్రూప్స్ అధినేత దోసపాటి నాగేశ్వరరావు, కార్యదర్శి దండా రాధాకృష్ణ, వెచ్చా చంద్రశేఖర్, సతీష్, రాము, రాజు తదితరులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో చాంబర్ ఆఫ్ కామర్స్ నిర్ణయం తీసుకుని ఈ వితరణ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంక టేశ్వరరావు, వందనపు వాసు, మౌనిక రెడ్డి, బేతంచర్ల వెంకటేశ్వర్లు, శ్రీదేవి మెడికల్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కొత్తగూడెం, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్, జనరల్ కెప్టెన్, వివిధ స్పోర్ట్స్ కెప్టెన్ల నియామకాల కోసం కమిటీ సమావేశాన్ని మంగళవారం కొత్తగూడెం ఏరియా డీజీఎం (పర్సనల్) బి. శివ కేశవ రావు సమక్షంలో నిర్వహించారు. ఈ కమిటీ సమావేశంలో స్పోర్ట్స్ కో ఆర్డినేరుటుగా జే. రాంబాబు, జనరల్ కెప్టెన్‌గా కే. నాగమోహన్ నియమించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఎఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ వి. మల్లిఖార్జున్‌రావు, కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్, స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ ఎం. శ్రావణ్‌కుమార్, పాల్గొన్నారు.

హోటల్స్‌లో డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తే చర్యలు

చండ్రుగొండ, సెప్టెంబరు 10: గృహాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వ్యాపార సంస్థలు, హోటళ్లలో వినియోగిస్తే వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని కొత్తగూడెం సివిల్ సప్లై డీటీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం ఆయన స్థానిక హోటళ్లను పరిశీలించారు. హోటళ్ల నిర్వాహకులతో మాట్లాడుతూ ఇప్పటివరకు తెలిసో తెలియకో ఎవరైన డొమెస్టిక్ సిలిండర్లను వాడుతుంటే ఆసిలిండర్ల వాడకాన్ని విరమించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక గ్యాస్ ఏజన్సీ కార్యాలంలోని రికార్డులను డీటీ పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణకు భద్రాద్రి యూనిట్‌ను పంపాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు10: ఎస్సీ వర్గీకరణకు భద్రాద్రి జిల్లా యూనిట్‌లను పంపించి త్వరతిగతిన వర్గీకరణకు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మాదిగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోదుగు జోగారావు మంగళవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని మాదిగ కులాలకు చెందిన ప్రతినిధులను ఒక యూనిట్‌గా నివేదికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆర్టీసీ జేఏసీ అధ్యక్షులు ఇస్రం నరసింహారావు, మాదిగ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షులు జున్నురవి, విద్యార్థి సంఘం నాయకులు ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఐక్యంగా వ్యతిరేకిద్దాం: మాలమహానాడు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 10: ఎస్సీ వర్గీకరణను ఐక్యంగా కలిసి పోరాడి వ్యతిరేకిద్దామని మాల మహానాడు జేఏసీ కమిటీ జిల్లా కన్వీనర్ మధుసూధన్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద గల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని రాష్ట్రాలకు అధికారాన్ని ఇస్తూ అత్యున్నత న్యాయ స్థానం తీర్పు వెలువడించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

నేడు వాహనాలకు వేలం పాట

చుంచుపల్లి, సెప్టెంబరు 10: కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు ఉదయం 11 గంటలకు రైటర్ బస్తీలోని ఎక్సైజ్ కార్యాలయానికి సకాలంలో హాజరై పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా వారి వెంట ఆధార్‌కార్డు, పాన్ కార్డు తప్పని సరిగా తీసుకురావాలని సూచించారు.

ఆసుపత్రి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

మణుగూరు రూరల్, సెప్టెంబరు 10: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే కార్మికుల వేతనాలు పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో కార్మికులు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్‌కు వినతిప్రతాన్ని అందించారు. కార్యక్రమంలో మల్సూర్, గోనెల రమేష్, సంధ్య, ఝాన్సీ ముత్తయ్య, జోష్ణ, మీన తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఆసుపత్రిలో పర్యటించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి కూడా సిబ్బంది వేతనాల సమస్యలను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

చెరువు భూములు ఆక్రమిస్తే చర్యలు: తహసీల్దార్

గుండాల, సెప్టెంబరు 10: మండలంలోని ప్రభుత్వ భూములను, చెరువులు, కుంటలకు సంబంధించి భూములు ఆక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఇమ్మానుయెల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద ఆక్రమణకు గురైన చెరువు భూమిని స్వాధీనం చేసుకున్నారు. బతుకమ్మ ఘాట్, విగ్రహ నిమర్జన స్థలం ఆక్రమణకు గురికావడంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్, సీఐ రవీందర్, ఎస్‌ఐ రాజమౌళి అక్కడికి చేరుకొని ఆక్రమణ భూమిని పరిశీలించారు. చెరువులోకి వెళ్లే దారిని స్వాధినం చేసుకొని హద్దులు ఏర్పాటు చేశారు. బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బఫర్ స్థలాలు, శిఖం భూములను ఆక్రమిస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాష్ట్ర స్పోర్ట్స్ వైస్ చైర్మన్‌ను కలిసిన జిల్లా పవర్ లిఫ్టింగ్ సభ్యులు

భద్రాచలం, సెప్టెంబరు 10: రాష్ట్ర స్పోర్ట్స్ వైస్ చైర్మన్, ఎండీ సోనీబాలాదేవిని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు కలిసారు. మాల్టా దేశంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన మోడెం వంశీని అభినందించారు. అలాగే కామన్‌వెల్త్ క్రీడల్లో సైతం పాల్గొనే అవకాశం దక్కినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జివి రామిరెడ్డి, డాక్టర్ శివరామకృష్ణ, మహంతి, కృష్ణాజి పాల్గొన్నారు.

పంచాయతీకి ఫ్రీజర్ బాక్స్ అందజేత

మండలంలోని గుండెపుడి గ్రామానికి సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మిన్ని కృష్ణమూర్తి తన తల్లిదండ్రులు కొమ్మిన్ని నారాయణ - జానికమ్మల జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్స్(శవపేటిక)ను ఇవ్వగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పంచాయతీ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించారు.

దేవస్థానం ఉద్యోగుల విధుల్లో మార్పులు

భద్రాచలం సెప్టెంబరు 10: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పలువురు ఉద్యోగుల విధుల్లో మార్పులుచేస్తూ దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. బి.కే.వి.వి.ఎస్ శ్రీనివాసరావు క్యాషియర్‌గా, కె.సతీష్ లడ్డు ఇష్యూయింగ్ కౌంటర్ ఇన్‌చార్జ్‌గా ఎం.నరసింహారావు ప్రసాదాల ఇష్యూయింగ్ కౌంటర్ రిలీవర్‌గా కె.వెంకటేశ్వరరావును అకౌంటెంట్ గా, టి.రాకేష్ రీజనల్ స్టోర్స్‌కు నియమించారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా సిబ్బంది విధుల్లో మార్పు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సాంబాయిగూడెం చప్టాకు మరమ్మతులు చేపట్టాలి

మణుగూరు రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని సాంబాయిగూడెం పడిగేరు ప్రధాన రహదారిపై సాంబాయిగూడెం పేరంటాల చెరువు వద్ద ఉన్న చప్టాను పునరుద్ధరించి రాకపోకలకు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఇఫ్టూ జిల్లా నేత ఆర్ మధుసూధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం చప్టా ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లిన పేరంటాల చెరువు అలుగు నీరు చప్టాను పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. కొట్టుకుపోయిన చప్టా వల్ల రాకపోకలకు తీవ్ర ఆటకం ఏర్పడిందన్నారు. అధికారులు సత్వర చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా తూరుబాక కల్వర్టు

దుమ్ముగూడెం సెప్టెంబరు 10: భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై తూరుబాక వంతెన సమీపాన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టు భీము పగిలి లోతైన గుంత ఏర్పడడాన్ని అటుగా వస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్ మంగళవారం గుర్తించారు. అక్కడ తాత్కాలికంగా అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి, ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారమిచ్చారు.

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

- నివాళులర్పించిన ఎమ్మెల్యేలు కోరం, పాయం, రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, ఏఎస్పీ పరితోష్



ఇల్లెందు, దమ్మపేటలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం, జారే ఆదినారాయణ

నెట్‌వర్క్: తెలంగాణ పోరాటంలో నైజాంపాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని ఇల్లెందు, పినపాక, వైరా, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కోరం కనకయ్య పాయం వెంకటేశ్వర్లు, రాందాస్ నాయక్, జారే ఆదినారాయణ, కొత్తగూడెం ఏఎస్పీ పరితోష్ పంకజ్‌తో పాటు మండలాల్లో నాయకులు, అధికారులు, రజకసంఘం నాయకులు నివాళులర్పించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

గోదావరి ముంపు ప్రాంతాల పరిశీలన

పినపాక, సెప్టెంబర్ 10: గోదావరి వరద ప్రవాహం పెరుగుతండడంతో అధికారులు లోతట్టు, ముంపు ప్రాంతాలను మంగళవారం పరిశీలించారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలైన చింతలబయ్యారం, టీ.కొత్తగూడెం, రావిగూడెం గ్రామాలను సందర్శించి, అక్కడి వరద ముంపు భాదితులతో మాట్లాడారు. మండల రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖలు సమన్వయంతో గోదావరి ముంపు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు, వరద పరిస్థితిపై కలెక్టర్, ఉన్నతాధికారులకు వరద పరిస్థితిపై నివేదికలిస్తున్నట్లు, వారి సూచనలు మేరకు చర్యలు చేపడుతున్నట్లు పినపాక తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఓ కె వెంకటేశ్వరరావు తెలిపారు. వారు మాట్లాడుతూ ముంపు ప్రాంతాలో ప్రజలు, గోదావరి వరద పెరిగే అవకాశమున్నందున పునరావాస కేంద్రాలకు తరలి రావాలని, పునరావాస కేంద్రాలలో సహాయక చర్యలు, ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు ఆదినారాయణ, సాంబశివరావు, జైపాల్‌రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్ట పునర్నిర్మాణానికి ప్రతిపాదనను అందించాలి

- అధికారులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశం


చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు, సెప్టెంబరు 10: గుండెపుడి మేడికుంట చెరువుకట్ట పునర్నిర్మాణం కోసం ప్రతిపాదనలను అందించాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఇరిగేషన్ డీఈ కిషోర్‌కు ఆదేశించారు. మంగళవారం మండలంలోనిగుండెపుడి మేడికుంట చెరువును ఆయన సందర్శించి కోతకు గురైన కట్టను, చెరువును పరిశీలించారు. చెరువులో ఉన్న చెత్తా, చెదారాన్ని తొలగించి కట్టను పటిష్టం చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. దీంతో రైతుల సమక్షంలోనే ఎమ్మెల్యే ఇరిగేషన్ డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో చెరువులో ఉన్న చెత్తను తొలగించి కట్ట పునర్నిర్మాణం చేపడతామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని తెలిపారు. కట్ట కోతకు గురికావడంతో సకాలంలో స్పందించి తాత్కాలిక మరమ్మతులను చేపట్టి కట్ట పూర్తిగా తెగకుండా స్వచ్ఛందంగా చర్యలు చేపట్టి ముప్పును తొలిగించిన గ్రామస్థులు, అధికారులను ఆయన అభినందించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులై తొలిసారి మండలానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను జూలూరుపాడు, గుండెపుడి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, నాయకులు దుద్దుకూరి మధుసూధన్‌రావు, నున్నా రంగారావు, దారావత్ రాంబాబు, కాళ్ళూరి వెంకటేశ్వరరావు, నవీన్ రాథోడ్, ఎస్.పుల్లారావు పాల్గొన్నారు.

మంచం పట్టిన పల్లెలు

- జ్వరాలతో ఆసుపత్రులు కిటకిట
- ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే పాయం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు, రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, సెప్టెంబరు 10 : పినపాక నియోజకవర్గంలోని కరకగూడెం మణుగూరు పినపాక మండలాలల్లో ప్రజలు వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రైవేటు ఆసుపత్రులు అన్ని వైరల్ ఫీవర్ రోగులతో కిటకిటాడుతున్నాయి. అంతే కాకుండా మణుగూరు ప్రభుత్వ వైద్యశాలలో కూడా రోజుకు 400 మంది అవుట్ పేషంట్లు నమోదు అవుతుంటే వారిలో 280 మంది వైరల్ జ్వరాల లక్షణాలతో ఉన్న వారే ఉంటున్నారు. ఆసుపత్రిలో ఉన్న 100 బెడ్స్‌లక్ష స్త్రీ పురుషుల వార్డుల్లో 80 బెడ్లు జ్వరపీడితులతో దర్శనమిస్తున్నాయి. చిన్నారుల నుంచి వయో వృద్దుల వరకు ఎక్కువ శాతం వైరల్ జ్వరాల పీడితులు వైద్య సేవలు పొందుతున్నారు.ఆసుపత్రికి వచ్చే జ్వర పీడితుల కు సంబంధించి వారి ఆరోగ్య పరిస్థితుల బట్టి మందులు రాసి ఇస్తున్నామని, బాగా అస్వస్థతతో ఉన్న వారిని ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని పూర్తిగా నయం అయిన తర్వాత డిచార్జి చేస్తున్నామని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కిక్కిరిసి పోతున్న ప్రవేటు వైద్యశాలలు

మణుగూరులో ప్రభుత్వ ఆసుపత్రిలో పరిస్థితులు ఇలా ఉంటే ప్రవేటు ఆసుపత్రుల్లో పరిస్థితి చాలా దారుణంగా తయారైంది. బెడ్స్ లేక కూర్చిలపైనే కూర్చొని సిలెన్ బాటిల్స్ ఎక్కించుకుంటున్నారు జ్వరపీడితులు..ఆసుపత్రులు అన్ని దాదాపు జ్వరపీడితులతో కిక్కిరిసిపోతున్నాయి. జ్వరం ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు జ్వర పీడితులు తెలిపారు.

ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆసుపత్రిలో జర్వపీడితులను పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితులపై, స్థానికంగా అందుతున్నవైద్య సేవలపై ఆరా తీశారు. మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సిబ్బందికి తెలిపారు.

కరకట్ట మీదకు అనుమతి లేదు..

- నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ పరితోష్


నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఎస్పీ పరితోష్

భద్రాచలం, సెప్టెంబరు 10: భద్రాచలంలోని గోదావరి నది కరకట్ట వద్ద గణేష్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్ పంకజ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరద పెరుగుతున్నందున కరకట్ట మీదకు భక్తులను అనుమతించవద్దని సూచించారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో కరకట్ట మీద ఎవరైనా సంచరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కరకట్ట పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

నిమజ్జనానికి ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ఇల్లెందు టౌన్: గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. మంగళవారం ఇల్లెందు పట్టణ సమీపంలో గల లలితాపురం హార్డ్ నెంబరు చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. ఇల్లెందు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి గణేష్ నిమజ్జనానికి గణనాధులు తరలిరానున్నారని అందుకు అనుగుణంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండ నిమజ్జనం చేసేవిధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇల్లెందులపాడు మంచినీటి చెరువులో నిమజ్జనం లేనందున అధికారికంగా హార్డ్ నెంబర్ చెరువు వద్దనే ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ యాదగిరి, సింగరేణి జీఎం జాన్ ఆనంద్, ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ ఏడీఈ, తహసీల్దార్ కోట రవికుమార్, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, బొల్లా సూర్యం, నరేష్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాలు వద్ద జాగ్రత్త

మణుగూరు : గోదావరి నది వరద ప్రవాహాలు పెరుగుతున్నాయని, ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేసిన క్రమంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జన కార్యక్రమాలను సూచించిన ప్రాంతాల్లో నే చేపట్టాలని మణుగూరు సీఐ మండల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు కమిటీ సభ్యులందరినీ పిలిచి సమావేశాన్ని ఏర్పాటు చేసి పోలీసు నిబంధనలు తెలిపి హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనల మేరకు మాత్రమే నిమజ్జన కార్యాక్రమాలను చేపట్టాలని సూచించారు.

కమలాపురంలో తహసీల్దార్ పర్యటన

తహసీల్దార్ రాఘవ రెడ్డి మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని అన్నారం కమలాపురం గ్రామాలనుమంగళవారం సందర్శించి గోదావరి వరద పోటెత్తే ప్రాంతాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో గోదావరి వరద ప్రవాహాలు ముందుకు చేరనున్న క్రమంలో స్థానిక గ్రామస్థులతో మాట్లాడారు. పలు సూచనలు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరి పెరుగుతుందని గోదావరి ఒడ్డు ప్రాంత ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ లీలావతి తదితరులు పాల్గొన్నారు.